ఈనాడు
కృష్ణా
సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు

డెల్టాకు ఊపిరి

- పట్టిసీమ గట్టి సేవ
- ఆక్వాకు ఆయువు
- వరి సాగుకు వరం
- రూ.వేల కోట్ల ఆదాయం

కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో దాదాపు 13 లక్షల ఎకరాలకు నీటి అవసరాలను పట్టిసీమ తీరుస్తోంది.

మూడు జిల్లాల్లో ఆక్వారంగంలో రూ.3 వేల కోట్లు, వ్యవసాయ, వాణిజ్య పంటల ద్వారా రూ.4 వేల కోట్ల మేరకు ఆదాయం సమకూరనుందని అంచనా.

జులై మొదటివారం నాటికి కృష్ణానదికి జిల్లాకు పైనున్న ఆరు ప్రాజెక్టుల పరిధిలో చుక్కనీరు లేదు. ఒక్క ఎకరాకు కూడా నీరు సరఫరా చేయలేదు. కాని జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా.. ఎన్నడూ లేని విధంగా కాల్వలకు నీటిని విడుదల చేశారు. 12 ఏళ్ల తర్వాత మోటూరు ఛానెల్ ద్వారా మండవల్లి మండలం శివారు కొల్లేరు ప్రాంతం చింతపాడుకు, 16 ఏళ్ల తర్వాత గుడివాడ ఛానెల్ నుంచి పెనుమాకలంకకు నీటిని అందించారు. ఈ ఏడాది ముందస్తుగానే ఖరీఫ్ సాగు మొదలైంది. ఆక్వారంగం మళ్లీ ఊపిరి పోసుకుంది. జిల్లా రైతులకు ఆదాయమార్గాలు పెరగడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దీనంతటికీ కారణం.. పట్టిసీమ నీరే!




నిండుకుండలా ఉన్న పోల్‌రాజ్ కాలువ

న్యూస్‌టుడే, మండవల్లి

నాలుగు వందల ఏళ్లలో కృష్ణాజిల్లా అనుభవించని నీటి కష్టాలను 2013-15 సంవత్సరాల్లో చవిచూసింది. కృష్ణానదిపై ఎగువ రాష్ట్రాల్లో పెరిగిన వాడకం, నూతన ప్రాజెక్టులతో వచ్చే నీటికి అడ్డుకట్టలు పడ్డాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో నదికి శివారున ఉన్న కృష్ణాడెల్టాకు కనీసం తాగునీరు సైతం దొరకని పరిస్థితి ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు వచ్చేవరకు డెల్టాకు నీటికష్టాలు తప్పవని అందరూ భావించారు. కాని 2015 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జిల్లాలోని రైతులను పట్టిసీమ తల్లిలా ఆదుకుంది. ఈ ఏడాది జూన్ 26న పట్టిసీమ ప్రాజెక్టుద్వారా నీటిని కృష్ణానదికి తరలించారు. ఇది డెల్టా తీరుతెన్నులనే మార్చేసింది. సాధారణంగా జిల్లాలో సెప్టెంబరులో నాట్లు మొదలయ్యేవి. నవంబరు, డిసెంబరులో వచ్చే తుపానులతో పంటలు తీవ్రంగా నష్టపోయేవి. పట్టిసీమ ప్రాజెక్టు సాయంతో ఈసారి జులైలోనే ఖరీఫ్ సాగును రైతులు ప్రారంభించడంతో తుపానుల ముప్పునుంచి గట్టెక్కినట్లేనని భావిస్తున్నారు.

సాగుదారులకు బాసట..

పట్టిసీమ నీటితో రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో 7,37,498 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా (మిగతా 2వ పేజీలో)



మంచినీటి లభ్యతతో గట్ల వరకు నిండిన చేపల చెరువు

సరిహద్దుల్లో నిఘానేత్రం

అమల్లోకి ఎస్పీ త్రిపాఠి ఆదేశాలు



కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన నిఘా నేత్రం

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలతో జిల్లా సరిహద్దు ప్రాంతంలో నిఘా నేత్రం ఏర్పాటయ్యింది. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడంతో పాటు రహదారి ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా ఎస్పీ త్రిపాఠి పలు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఇటీవల చోటు చేసుకుంటున్న అవాంఛనీయ కార్యకలాపాలపై దృష్టి సారించిన ఆయన జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అవనిగడ్డ సీఐ మూర్తి నేతృత్వంలో అవనిగడ్డ వారధి సమీపంలో ఆదివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విజయవాడ- మచిలీపట్నం రహదారి విస్తరణ పనుల కారణంగా ఆ మార్గంలో ప్రయాణం ఇబ్బందికరంగా ఉండటంతో కరకట్ట మీదుగా వెళ్లే వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. కరకట్టపై ఇటీవల పలు ప్రమాదాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కరకట్టతో పాటు ప్రధాన రహదారుల్లో కూడా వేగాన్ని నియంత్రించేలా గ్లోసైన్ బోర్డులతో కూడిన డ్రమ్‌లను ఏర్పాటు చేశారు. ఇటీవలే ఉయ్యూరు మండల పరిధిలో ఒక యువకుడిని హత్యచేసిన వ్యక్తులు శవాన్ని కాలువలో పడవేశారు. కరకట్ట అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారిందన్న విమర్శలూ ఉన్నాయి. వీటిని అరికట్టే చర్యల్లో భాగంగా స్థానికుల భాగస్వామ్యంతో కరకట్టపై కూడా నిఘానేత్రాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. త్వరలో అవి సాకారమయ్యే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు.

గ్రామీణ వైద్యం.. ఆరోగ్య సోపానం!
మధ్య పేజీల్లో..

పిల్లల సామర్థ్యాలపై సర్వే -13లో

భృతికి వేళాయె!

- జిల్లాలో 52,376 మంది నిరుద్యోగుల గుర్తింపు
- ఉపాధి కార్యాలయాల ఆధునికీకరణకు చర్యలు
- విద్యార్హతల వారీగా వివరాల సేకరణ



ఈనాడు, అమరావతి

ఎన్నికల హామీలో భాగంగా తెదేపా చేసిన నిరుద్యోగ భృతి వాగ్దానం త్వరలో సాకారం కానుంది. నిజంగా ఇది నిరుద్యోగులకు తీపి కబురే. డిగ్రీ, పీజీలు చేసి ఎలాంటి కొలువులు లేకుండా ఖాళీగా ఉంటున్న నిరుద్యోగులకు ఉద్యోగాలకు సరిపడా నైపుణ్యాలను పెంపొందించుకోవటానికి లేదా పోటీ పరీక్షలకు తర్ఫీదు పొందటానికి దోహదపడేలా నిరుద్యోగ భృతిని ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు వాగ్దానం చేశారు. దాన్ని ఇప్పుడు అమలు చేయటానికి చర్యలు తీసుకుంటున్నారు.

కంప్యూటరీకరణ

నిరుద్యోగుల వివరాలను నమోదు చేసుకునే జిల్లా ఉపాధి కార్యాలయాలను (జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజెస్) అన్ని హంగులతో బలోపేతం చేయటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు కార్యాలయాలను పూర్తిగా (మిగతా 2వ పేజీలో)

ఇక గ్రామవికాసం

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా జిల్లాలో నేటికి మంచినీటి కొరత ఎదుర్కొంటున్న గ్రామాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోనే ఏడాది పొడవునా తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి గ్రామానికి కనీసావసరమైన శ్మశానవాటికలు లేని గ్రామాలు కొన్నయితే, ఘన, వ్యర్థాల నిర్వహణకు స్థలం కూడా సమకూర్చుకోలేనివి మరికొన్ని. అంతర్గత రహదారులు అంతంత మాత్రంగా ఉన్న పంచాయతీల గోడు ఒకరకంగా ఉంటే అప్రోచ్ రోడ్లు కూడా లేని గ్రామాలు బాధ మరో రకం. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేయదలచిన 'మిషన్ అంత్యోదయ' కార్యక్రమం విజయవంతమైతే జిల్లాలో దాదాపు 194 పంచాయతీలకు మహర్దశ వచ్చినట్లే.

న్యూస్‌టుడే, కలెక్టరేట్

గ్రామసీమల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా వాటిని నూరు శాతం సద్వినియోగం చేసుకునే గ్రామాలను వేళ్లమీద లెక్కించవచ్చు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకున్నా ఉపాధి, మౌలిక వసతుల వంటి కొన్ని సమస్యలు నిత్యనూతనంగానే మిగులుతుంటాయి. ఈ పరిస్థితులను అధిగమించేలా గ్రామ వికాసంతో పాటు కుటుంబ వికాసాన్ని కూడా సాధించాలన్న లక్ష్యంతో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామ సంపూర్ణ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి రూ.10 వేల కనీస ఆదాయం కల్పించాలన్నదే (మిగతా 2వ పేజీలో)



- కరవు, పేదరిక నిర్మూలనే ధ్యేయం
- కుటుంబానికి రూ.10వేల ఆదాయ కల్పన లక్ష్యం
- మిషన్ అంత్యోదయకు ఎంపికైన 194 గ్రామాలు
- 2019 నాటికి లక్ష్యసాధన దిశగా కార్యాచరణ

డెల్టాకు ఊపిరి

(మొదటిపేజీ తరువాయి)

అందులో 2 లక్షల ఎకరాల మేరకు చేపల చెరువులుగా రూపాంతరం చెందాయి. వ్యవసాయానికి, చేపల పెంపకానికి నీటి లభ్యతే కీలకం. జిల్లాలో ఏడాదికి తాగు, సాగునీటి అవసరాలకు ఏటా 160 టీఎంసీల నీరు అవసరమవుతుంది. కృష్ణానది నుంచి వచ్చే నీరు కనీసం తాగునీటి అవసరాలను కూడా తీర్చలేకపోతోంది. ఈ తరుణంలో 2016లో పట్టిసీమ ద్వారా 57 టీఎంసీలు కృష్ణాకు తరలించగా.. ప్రస్తుతం 80 టీఎంసీల నీటిని తరలించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధంచేశారు. దీంతో పంటల సాగుకు అవసరమైన నీటిని సకాలంలో అందించడంతో రూ.వేలకోట్ల ఆదాయాన్ని సమకూర్చేందుకు అవకాశం కలిగింది.

ఆక్వా రంగానికి ఆయువు పట్టు

మంచినీటి లభ్యతపైనే చేపల పెరుగుదల ఆధారపడి ఉంటుంది. రెండేళ్ల కిందటి వరకు రాష్ట్రంలో సరైన వర్షపాతం నమోదవ్వకపోవడంతో చేపల పరిశ్రమ గడ్డుకాలాన్ని ఎదుర్కొంది. దీంతో రాష్ట్ర ఆక్వారంగానికి తలమానికంగా ఉన్న కృష్ణా జిల్లాలోని చేపల రైతులు ఇబ్బందులు పడ్డారు. రూ. లక్షల్లో లీజులు చెల్లించి చెరువులను నెలల తరబడి ఖాళీగా ఉంచేశారు. మంచినీటి లభ్యత లేకపోవడంతో చెరువుల్లో ఉప్పుశాతం విపరీతంగా పెరిగిపోయింది. కృష్ణానదిలో వచ్చే కొద్దిపాటి నీరు తాగు, సాగు అవసరాలకు సరిపోకపోవడంతో జిల్లా ఆక్వా రైతులు పక్క జిల్లాల వైపు చూసే పరిస్థితి నెలకొంది. ఏటా 2 లక్షల ఎకరాల్లో సాగుతో జిల్లా నుంచే 7.10 లక్షల టన్నుల ఉత్పత్తులను ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేసే ఈ రంగానికి నీటి లభ్యత లేకపోవడంతో ఆక్వా పరిశ్రమ పూర్తిగా దెబ్బతింది. పట్టిసీమ నుంచి భారీగా గోదావరి నీరు జిల్లాకు రావడంతో మళ్లీ సాగుదారుల్లో ఆశలు రేగాయి. ప్రస్తుతం నీటిఎద్దడి నుంచి ఆక్వా రంగం కోలుకుంటోంది.

భవిష్యత్తులోనూ..

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేవరకు.. పట్టిసీమే జిల్లాకు ప్రధాన నీటివనరుగా నిలుస్తుంది. కర్ణాటకలోని ఆల్‌మట్టి డ్యాం ఎత్తును 519.6 మీటర్లనుంచి 524.25 మీటర్లకు పెంచేందుకు బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఇప్పటికే పచ్చజెండాను ఊపింది. ఫలితంగా ఆ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 250 టీఎంసీ అడుగులకు పెరుగుతుంది. తెలంగాణలో కొత్తగా వస్తున్న నెట్టెంపాడు, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ ద్వారా మరో 250 టీఎంసీలు, నారాయణ్‌పూర్ 35 టీఎంసీలు, జూరాల 10 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఉన్నాయి. ఏటా కృష్ణానది పరీవాహక ప్రాంతంలో 600 టీఎంసీ అడుగుల కంటే అధికంగా వస్తేనే జిల్లాకు నీరు విడుదలవుతుంది. ఈ ప్రాజెక్టులన్ని పూర్తిస్థాయిలో నీటి నిల్వకు అనుకూలంగా మారితే నది శివారునున్న కృష్ణాడెల్టా మనుగడ ప్రశ్నార్థకంగా కానుంది. ఈ తరుణంలో పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే వరకు పట్టిసీమే నీరే ఆధారంగా కనిపిస్తోంది.

డెల్టా రైతుల్ని అదుకుంది



తీవ్ర నీటిఎద్దడి పరిస్థితులతో అల్లాడుతున్న డెల్టా రైతులను ఆదుకున్న ఘనత పట్టిసీమకే దక్కుతుంది. ఈ ప్రాజెక్టు లేకుంటే నీటి కష్టాలు వర్ణనాతీతం. కనీసం తాగునీటికే దిక్కులేని సమయంలో పట్టిసీమ ప్రాజెక్టు అందించిన సాయం మరిచిపోలేనది. . 26 పంపులతో 80 టీఎంసీల నీటి అందిస్తోంది. దీని ద్వారానే జిల్లాలోని రైతులు ముందస్తు సాగు చేసుకున్నారు. నీరు లేక ఇబ్బంది పడుతున్న ఆక్వా రైతులను తల్లిలా ఆదుకుంది. దీని నిర్మాణానికి కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి ఉమామహేశ్వరరావుకు, ఇతర అధికారులందరికీ చేపల రైతుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– చదలవాడ శేషగిరిరావు. రాష్ట్ర చేపల సంఘం ఉపాధ్యక్షుడు

కష్టాలు గట్టెక్కాయి..



రెండేళ్ల కిందటి వరకు చేపల సాగుకు అవసరమైన నీరు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాం. పట్టిసీమ వల్ల రెండేళ్లుగా పుష్కలంగా నీరు లభించడంతో కష్టాల కాస్త గట్టెక్కాయి. చేపల సక్రమ పెరుగుదలకు, వ్యాధి నిరోధక శక్తికి మంచినీరు ఎంతో అవసరం. దాని లభ్యత బట్టే లాభనష్టాలు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం పెద్దఎత్తున నీరు అందుబాటులో ఉన్నందున ఈసారి ఆక్వారంగంలో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, చేపల రైతు

ఇక గ్రామవికాసం

(మొదటిపేజీ తరువాయి) 'మిషన్ అంత్యోదయ' ప్రధాన ఉద్దేశం.

సమగ్రాభివృద్ధి కోసం..

గ్రామసీమలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మాగాంధీ ఆశయం మేరకు ఆయన 150 జయంతి నాటికి కొన్ని గ్రామాలనయినా సమగ్రాభివృద్ధితో వికసింపజేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయా గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నూరు శాతం అమలయ్యేలా మిషన్ అంత్యోదయ ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించింది. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో పేదరికం, కరవులను పూర్తిగా నిర్మూలించడంతో పాటు ప్రతి కుటుంబానికి మెరుగైన ఆదాయ కల్పన ఉండేలా చూడాలని సూచించింది. ఇందుకోసం రాష్ట్రంలో 2,584 గ్రామ పంచాయతీలను ఎంపిక చేయాల్సి ఉండగా వీటిలో 194 పంచాయతీలను జిల్లాకు కేటాయించారు. బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) గ్రామాలు, మెరుగైన నీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తున్నవి, వివాద రహితంగా ఉండే పంచాయతీలు, పురస్కారాలు దక్కించుకున్నవి, రూర్బన్ పరిధిలో ఉన్నవి, సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకంలో ఉన్న గ్రామాలకు ఎంపికలో ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఇక ఎంపిక సందర్భంలో ఆయా పంచాయతీ కమిటీలు పేదరిక నిర్మూలన, సజావుగా గ్రామసభల నిర్వహణ, పారదర్శకంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలు, మానవ వనరుల గుర్తింపు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆదర్శవంతంగా ఉండటం, తదితర అంశాల పరంగా తమ ఒప్పుకోలును తెలియజేయాల్సి ఉంది. కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు జిల్లాలోని 49 మండలాల నుంచి ఆయా ఎంపీడీవోలు మొత్తం 194 ప్రంచాయతీలను మిషన్ అంత్యోదయకు ఎంపిక చేశారు. అత్యధికంగా బందరు మండలం నుంచి ఏడింటిని ఎంపిక చేశారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల నుంచి ఆరు గ్రామాల చొప్పున, గూడూరు, పెడన, కైకలూరు, కలిదిండి, పామర్రు, నందిగామ, వత్సవాయి, ఆగిరిపల్లి, గంపలగూడెం, బాపులపాడు, నూజివీడు, పమిడిముక్కల, ఉంగుటూరు మండలాల నుంచి అయిదేసి వంతున, బంటుమిల్లి, ఘంటసాల, మొవ్వ, నాగాయలంక, గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, చందర్లపాడు, జి.కొండూరు, కంకిపాడు, వీరులపాడు, చాట్రాయి, గన్నవరం, తిరువూరు మండలాల్లో నాలుగేసి, కోడూరు, కృత్తివెన్ను, మోపిదేవి, జగ్గయ్యపేట, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, తోట్లవల్లూరు, విజయవాడ రూరల్, ఎ.కొండూరు, ముసునూరు మండలాల్లో మూడేసి, మిగిలిన మండలాల్లో రెండు గ్రామాల చొప్పున ఎంపిక చేశారు.

కార్యాచరణ తీరిది

'మిషన్ అంత్యోదయ' గ్రామాల్లో ప్రధానంగా గ్రామ వికాసం, కుటుంబ వికాసాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. గ్రామ వికాసంలో భాగంగా ప్రభుత్వపరంగా అమలు చేస్తున్న పథకాలను పూర్తిగా వర్తించేలా చర్యలు చేపడతారు.

- ❖ కుటుంబ వికాసం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.10 వేల కనీస ఆదాయాన్ని కల్పించే క్రమంలో భూమి, నీటి యాజమాన్యాలను అభివృద్ధి పర్చేలా పంట కుంటలు, ఊట చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల పూడికతీత, వర్మి కంపోస్టు, ఉద్యానవన పంటలు, ఎన్టీఆర్ జలసిరి, పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.
- ❖ అందరూ నిరుద్యోగులుగా ఉన్న కుటుంబాలను గుర్తించి వారిలో కనీసం ఒక్కరికైనా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించి వివిధ సంస్థల సహకారంతో స్వయం ఉపాధి మార్గం కల్పిస్తారు.
- ❖ నరేగా, ఇతర పథకాల ద్వారా ఏడాదిలో 200 నుంచి 240 రోజులపాటు అవసరమైన వారికి వేతన భృతి లభించేలా చూస్తారు.
- ❖ కుటీర పరిశ్రమలు, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు తదితరాల ఏర్పాటుకు బ్యాంకు అనుసంధాన రుణాల ఏర్పాటు వంటి సహకారం అందిస్తారు.
- ❖ వ్యవసాయ, అనుబంధ విభాగాలు, పశుసంవర్ధక, మత్స్య శాఖల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రతి ఒక్కరికి బతుకుతెరువు కల్పించేలా చర్యలు చేపడతారు.
- ❖ గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇంకుడు గుంతలు, నూరు శాతం వ్యక్తిగత మరుగుదొడ్లు, ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటు, అన్ని రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపు వంటి పనులు నిర్వహిస్తారు.
- ❖ సామాజికాభివృద్ధికి ఆరోగ్య, విద్య, మహిళా, శిశు సంక్షేమం, పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితర అంశాల్లో నూరు శాతం పురోగతి సాధించాలి.

ఎంపిక జాబితాను ప్రభుత్వానికి నివేదించాం

మిషన్ అంత్యోదయ చక్కని కార్యక్రమం. ఈ పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన 194 పంచాయతీల జాబితాను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. తదుపరి ఆదేశాలతో కార్యాచరణ చేపడతాం. ముఖ్యంగా ఎంపికైన పంచాయతీ కార్యవర్గాలు సంబంధిత ప్రభుత్వ శాఖలు, గ్రామంలోని స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద బృందాల సహకారాన్ని సమన్వయ పర్చుకుంటూ లక్ష్యసాధనలో మమేకమైతే నిర్దేశిత గడువు లోపే సంపూర్ణ అభివృద్ధి ఫలాలు దక్కించుకోవచ్చు.

–ఎన్‌వీవీ సత్యనారాయణ, జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో

భృతికి వేళాయెె!

(మొదటిపేజీ తరువాయి)

కంప్యూటరీకరించడానికి చర్యలు ముమ్మరమయ్యాయి. నిరుద్యోగులకు సంబంధించిన డేటా ఉపాధి కార్యాలయాల్లోనే ఉంటుంది. కొంతకాలంగా ప్రభుత్వాలు ఉపాధి కార్యాలయాలను చిన్నచూపు చూడటంతో కనీసం ఇక్కడ నిరుద్యోగుల వివరాలను నమోదు చేసుకునేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఇతరత్రా సామగ్రి కూడా లేకుండా పోయింది. కార్యాలయాల నిర్వహణ పరంగానే కాదు.. మానవ వనరుల కొరత కూడా ఈ కార్యాలయాల్లో అధికంగానే ఉంది. కనీసం ఒప్పంద ఉద్యోగుల నియామకానికి ఇక్కడ చర్యలు లేవు. దీంతో ఉన్నవారిపైనే పనిభారం ఉంటోంది. తొలుత ఇవన్నీ అధిగమించి త్వరలోనే నిరుద్యోగ భృతిని చెల్లించటానికి కార్యాలయాలను సన్నద్ధం చేయాలనే ఆలోచనకు తాజాగా ప్రభుత్వం రావటంతో ఉపాధి యంత్రాంగంలోనే కాదు.. నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కార్యాలయాలను ఆధునికీకరించేందుకు ఒక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నివేదిక అందగానే కార్యాలయాలను ఆధునీకరిస్తారు. మరోవైపు ఈ భృతిని నగదా? లేక నైపుణ్యాల శిక్షణ రూపంలోనా అనే దానిపై పది రోజుల్లో స్పష్టతకు రానుంది. భృతికి అర్హులైన నిరుద్యోగుల వివరాలను జిల్లా ఉపాధి, స్టెప్ అధికారులు తమ వద్ద నమోదు చేసుకున్న రిజిస్ట్రేషన్ల ఆధారంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. కృష్ణా జిల్లాలో 52,376 మంది ఉన్నారని తేల్చారు.

విద్యార్హతల వారీగా వివరాలు

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి పీజీ విద్యాభ్యాసం చేసినవారి దాకా తమ విద్యార్హతలను జిల్లా ఉపాధి కార్యాలయాల్లో నమోదు చేసుకుని తమ అర్హతలకు తగిన ఉద్యోగాలు చూపాలని కోరతారు. ఉపాధి కార్యాలయాలు ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలే కాదు, ప్రైవేటు కొలువులకు కూడా ఉపాధి అధికారులు ఫలానా కంపెనీ, పరిశ్రమలో ఉద్యోగాలు ఉన్నాయి. వాటి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఉపాధి కార్యాలయం నుంచి కాల్ లెటర్స్ పంపుతారు. రాష్ట్రంలో అత్యధికంగా కృష్ణా-గుంటూరు జిల్లాల్లో నిరుద్యోగుల జాబితా ఎక్కువగా ఉంది. కృష్ణాజిల్లాలో మొత్తం 52 వేల మందిలో పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు అత్యధికంగా 17 వేల మంది ఉన్నారు. డిగ్రీ, పీజీలు చేసిన వారు 25 వేల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సాంకేతిక విద్య అర్హతలతో పేర్లు నమోదు చేసుకున్న వారు 6 వేల మంది, పదిలోపు చదివిన వారు 4 వేలకు పైగా ఉన్నారు. వీరిలో విద్యార్హతలు కులాల వారీగా వివరాలు ఉన్నాయి. వికలాంగుల వివరాలను వేర్వేరుగానే తీసి గణాంకాలు ప్రభుత్వానికి అందజేశారు.

42 ఏళ్ల లోపు వారి వివరాలు..

ప్రభుత్వ ఉద్యోగానికి గరిష్ఠంగా 42 ఏళ్ల వయస్సు అమల్లో ఉంది. దీంతో ప్రస్తుతం నిరుద్యోగ భృతిపై కన్నేసి అనేక మంది ఆ వయస్సు పైబడిన వారు కార్యాలయాలకు వచ్చి తమ ఉపాధి కార్డు రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ వయస్సులో ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగం రావటం కష్టమని చెప్పి సున్నితంగా వెనక్కు పంపుతున్నారు. అయితే గతేడాది నుంచి పేర్లు నమోదు చేసుకునేవారితో కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రభుత్వం నిధిని కేటాయించినప్పటి నుంచి పది ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ఉపాధి కార్యాలయాలకు వచ్చి ధ్రువపత్రాలు, తమ విద్యార్హతల వివరాలను నమోదు చేయించుకుని వెళుతున్నారు. నిరుద్యోగ భృతి చెల్లించటానికి ఏదైనా ఒక సంవత్సరాన్ని కటాఫ్‌గా తీసుకునే అవకాశం ఉందని వినికిడి. ఎక్కువగా పది ఉత్తీర్ణులైన వారు, సాధారణ డిగ్రీలు చేసిన వారే తమ కార్యాలయాలకు రెన్యువల్ కోసం వస్తున్నారని ఉపాధి అధికారులు చెప్పారు. ప్రభుత్వం కోరిన విధంగా విద్యార్హతలు, వయస్సుల వారీగా ఉపాధి కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలను అందజేశామని తెలిపారు. అయితే ఇది నగదు రూపంలో ఇవ్వాలా లేదా ఇంకేదైనా పద్ధతిలో ఇవ్వాలా అనేది ఒక్కటే ఇంకా కొలిక్కి రావల్సి ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

మొక్కల సంరక్షణ సాధ్యమేనా?



వనం-మనంలో రహదారుల వెంట నాటేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పండ్ల మొక్కల సంరక్షణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు దీనికోసం రూ.కోట్లు వ్యయం చేస్తోంది. ఫలితం ఉండేలా సంరక్షణ చర్యలపై కట్టుదిట్టమైన చర్యలు లేవు. మూడేళ్లుగా జిల్లాలో మూడు కోట్లకు పైగా మొక్కలు నాటారు. ప్రస్తుతం 10 శాతం ఉన్నట్లు అంచనా. నాటిన వాటికి రక్షణ లేకపోవడమే కారణంగా ఉంది. గతేడాది నుంచి పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని గృహాల్లో నాటేందుకు ఇవ్వగా తాజాగా రహదారుల వెంట నాటడానికి ఇస్తున్నారు. వీటి సంరక్షణకు నిధులు కేటాయిస్తామని చెబుతున్నా సంరక్షణ సాధ్యమేనా అన్న ప్రశ్న అందరిలో తలెత్తుతోంది.

– న్యూస్‌టుడే, గంపలగూడెం

జిల్లాలో రహదారుల వెంట భారీగా మొక్కలు నాటేందుకు జిల్లా అధికారులు కార్యాచరణ రూపొందించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో కిలోమీటరు దూరం వరకు ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటాలని ఆదేశాలు జారీ చేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో తయారుచేసిన మొక్కలను జూన్ నుంచి గ్రామాలకు పంపిణీ ప్రారంభించారు. ప్రథమంలో నీడను అందించేవి సరఫరా చేశారు. ఇపుడు పండ్ల మొక్కలను అందిస్తున్నారు. నీడనిచ్చే మొక్కలు వరకు నాటేందుకు చొరవ చూపిన అధికారులు తాజాగా పండ్ల మొక్కలు నాటాలని ఆదేశాలు అందడంతో బెంబేలెత్తిపోతున్నారు. నాటిన వాటిని సంరక్షించడమే ప్రధాన సమస్యగా ఉంది. ఉపాధి హామీ పథకంలో మొక్కల సంరక్షణకు నిధులు కేటాయించినప్పటికి పూర్తిస్థాయిలో సఫలీకృతం కావనే సందేహం వ్యక్తమవుతోంది. గ్రామీణ రహదారుల వెంట నిత్యం పశువులు, గొర్రెలు, మేకలు సంచరిస్తాయి. పచ్చగా కన్పించే మొక్కలను తినేస్తాయి. అందునా సంరక్షణకు ఏర్పాటుచేసే కంచె పశువులను నియంత్రించే పటిష్ఠమైనదేమీ కాదు.



కొబ్బరి మొక్కలు

మూడు లక్షలకు పైగా మొక్కలు

జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో పండ్ల మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత వెలుగు ఉద్యోగులకు, వీరి ద్వారా పొదుపు సంఘాలకు అప్పగిస్తారు. జిల్లావ్యాప్తంగా 970 కి.మీ దూరం పండ్ల మొక్కలు నాటాల్సి ఉంది. కడియం నర్సరీల నుంచి మామిడి, నేరేడు, కొబ్బరి, బాదం మొక్కలు తీసుకువచ్చారు. జిల్లాలోని 50 మండలాల్లో 3లక్షలకు పైగా పండ్ల మొక్కలు రహదారుల వెంట నాటాలి. వాస్తవంగా కి.మీ దూరానికి 400 మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించగా ఇప్పటికే 80 నీడనిచ్చే మొక్కలు నాటే ప్రక్రియ సాగుతోంది. ఇక మిగిలిన 320 మొక్కలు ఫలాలు అందించేవి నాటాలి. ఇక గ్రామీణ రహదారుల వెంట కొబ్బరి మొక్కలు నాటితే అవి ఎంత సుర‌క్షితమే తెలియంది కాదు. ఇపుడు నాటే పండ్ల మొక్కలు ఇంకా నాలుగైదు ఏళ్లపాటు కంటిక రెప్పలా కాపాడితేనే లక్ష్యం నెరవేరుతుంది. వీటిని గృహాలు, రక్షణ ఉన్న ప్రభుత్వ కార్యాలయాల స్థలాల్లో నాటితే ఫలితం ఉంటుంది. రహదారుల వెంట నాటితే వాటి రక్షణ చర్యలు డొల్లగానే ఉంటాయి.

సంరక్షణకు రూ.3.50 లక్షలు

ఉపాధి హామీ పథకంలో కి.మీ దూరంలో నాటిన మొక్కల సంరక్షణకు మూడేళ్ల కాలానికి రూ.3.50 లక్షలు వరకు కేటాయిస్తున్నారు. మొక్కలకు గుంతలు తీయడం, నాటడం, కంచె ఏర్పాటు, నీరు పోయడం, కాపలా, ఎరువు తదితర పనుల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. కేటాయించిన నిధులు సజీవంగా ఉండే మొక్కలను పరిగణనలోకి తీసుకునే నిధులు చెల్లిస్తారు. కడియం పండ్ల మొక్కలు అంటే ప్రజలు ఎంతో ఆసక్తి చూపిస్తారు. అందుకే రహదారుల వెంట మొక్కలకు అంత భద్రత ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ట్రీగార్డ్‌కు రూ.79 కేటాయిస్తోంది. ఇది ఏమాత్రం సరిపోదు. ఒకవేళ మొక్కలు నాటిన సిమెంట్ కట్టడాలతో రక్షణ ఏర్పాటుచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. రక్షణ ఏర్పాటుకు ఇచ్చే సొమ్ము సరిపోదని గుర్తించిన అధికారులు దాతలను సమీకరించుకోవాలని మండల స్థాయి అధికారులకు సూచనలిస్తున్నారు. ట్రీగార్డ్ ఏర్పాటుకు రూ.100కు పైనే వ్యయం చేయాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చూస్తూ దాతల నుంచి సమీకరించాల్సి నిధులు రూ.లక్షల్లో ఉంటుంది.



మామిడి మొక్కలు

కడియం మొక్కలు సరఫరా చేస్తున్నాం



గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట కి.మీ దూరం వరకు నాటేందుకు కడియం నుంచి పండ్ల మొక్కలు వచ్చాయి. శనివారం నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్నాం. రోడ్ల వెంట గుంతలు తీయించి పండ్ల మొక్కలు నాటించాల్సి ఉంది. ట్రీగార్డ్‌లకు రూ.79 కేటాయిస్తున్నారు. దాతల సహకారం తీసుకోవాలి. పటిష్ఠమైన రక్షణ ఉంటేనే రహదారుల వెంట నాటే పండ్ల మొక్కలు ఎదుగుతాయి. గ్రామాల్లో మహిళలకు రోడ్ల వెంట పండ్ల మొక్కలు నాటేందుకు, సంరక్షణకు ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూతపై అవగాహన కల్పించాం.

- బి.రాజారావు, వెలుగు ఏపీఎం గంపలగూడెం

మండలాలకు చేరుతున్న ఏకరూప దుస్తులు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు ఏకరూపు దుస్తులు అందుతున్నాయి. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆప్కో కుట్టించిన ఏకరూప దుస్తులను మంటసాల, చల్లపల్లి, ఉయ్యూరు మండలాలకు శనివారం పంపింది. సోమవారం పామర్రు, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాలకు దుస్తుల్ని అందజేయనున్నట్లు ఎస్ఎస్ఏ వర్గాలు తెలిపాయి. పంపిణీ చేసిన దుస్తుల్ని తక్షణమే విద్యార్థులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

చరిత్రాత్మకం విజయపుర డిక్లరేషన్-2017



మాట్లాడుతున్న బొలిశెట్టి సత్యనారాయణ

గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: కరవు, వరదలు లేని భారతదేశం కోసం ఇటీవల విజయపురలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సభల్లో చారిత్రాత్మక విజయపుర డిక్లరేషన్‌ను రూపొందించినట్లు జలబిరాదరి జాతీయ సమన్వయకర్త బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డిక్లరేషన్‌లోని ప్రధాన అంశాలను వివరించారు. నదీ పరీవాహక దాని పునాదులు మొత్తాన్ని కలిపి ఒక నీటిని పంచుకునే అంశంగా కాకుండా ఒక సహజ జీవన వనరుగా పరిగణించాలని, జాతీయ నీటి పరిజ్ఞానం మిషన్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా నీటి పరిజ్ఞానాన్ని విద్యార్థులు, రైతులు, నీటి వినియోగదారులకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నదులను కాలుష్యాల బారి నుంచి కాపాడడం, ఆక్రమణలు తొలగించి నదులకు స్వాతంత్ర్య కల్పించడం ద్వారా నదీ జీవసమతుల్యతను కాపాడడం, ప్రజా భాగస్వామ్యంతో ప్రజా నదీ చట్టం ద్వారా నీటి హక్కుల ప్రాధాన్యతను పెంచి నీటి సద్వినియోగాన్ని అమలు చేయడం, నదీ పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు శాస్త్రవేత్తలతో నదీ పార్లమెంటు ఏర్పాటు చేసుకొని తద్వారా జల స్వాతంత్ర్య సాధించాలని తీర్మానించినట్లు చెప్పారు. బీజాపూర్‌లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో 29 రాష్ట్రాలు 7 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి జల సంరక్షకులు, జలవిజ్ఞాన వేత్తలు, భూగర్భ నిపుణులు, శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నట్లు తెలిపారు. సమావేశంలో జలబిరాదరి అమరావతి సమన్వయకర్త అనుమోలు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ క్రికెట్ టోర్నీకి వర్షం అంతరాయం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభం కావాల్సిన క్వాడ్రాంగులర్ ఏసీఏ క్రికెట్ టోర్నీకి వర్షంతో అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఔట్ ఫీల్డ్ మ్యాచ్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో మ్యాచ్‌లు నిలిపివేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.

గాండ్ల తెలుకుల సమస్యలను తీర్చండి



సంఘీభావం తెలుపుతున్న అఖిల గాండ్ల తెలుకుల యువజన నాయకులు

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: గాండ్ల తెలుకులను బీసీ-బి నుంచి బీసీ-ఎ లోకి మార్చాలని ఆంధ్రప్రదేశ్ అఖిల గాండ్ల తెలుకుల రాష్ట్ర సమావేశం తీర్మానం చేసింది. గాండ్ల తెలుకుల సమస్యలను పరిష్కరించేందుకు వారి కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆంధ్రప్రదేశ్ అఖిల గాండ్ల తెలుకుల యువజన సంఘం ఆవిర్భావ సమావేశం సమావేశం జరిగింది. గాండ్ల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమస్యలను చర్చించేందుకు, భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం తెలుకుల పెద్దలు, యువజనులు పాల్గొన్నారు. ముందుగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు గడిచినా గాండ్ల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితుల్లో మార్పు రాలేదన్నారు. 13 జిల్లాల్లో 7 లక్షల మంది జనాభా ఉన్న తెలుకులను చిన్న చూపు చూడడం తగదన్నారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రి వద్దకు వెళితే కనీసం చూసేందుకు కూడా అనుమతించలేదన్నారు. మా హామీలను నెరవేర్చకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సమావేశం కొన్ని తీర్మానాలను ఆమోదించింది.

★ బీసీ-బీ నుంచి బీసీ-ఎ లోకి మార్చాలి.

★ తెలుకుల విద్యార్థులకు ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేక వసతి, ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయాలి.

★ రాష్ట్రంలో ఉన్న దేవాలయాలకు నూనె సరఫరా చేసే అవకాశం తెలుకుల కులస్థులకే అందించాలి.

★ గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

ఈ సమావేశంలో రుద్రగోపి, ఒరుగొండ సురేష్, ముత్యాలపాటి రాంబాబు, చంద్రశేఖర్, వంశీకృష్ణ, పారేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనటరాజ్-ప్రతిక్షణం రేవతి-గౌతమ్‌నంద మినీరేవతి-ఆక్సిజన్
సిరికృష్ణ- లై సిరివెంకట్- ఫిదా శ్రీవినాయక్-జయ జానకినాయక
వెంకటేశ్వర-నేనేరాజు నేనేమంత్రి
రాంశాంతి- నక్షత్రం
రామరాజు-ఆనందోబ్రహ్మ
బృందావన్- దువ్వాడ జగన్నాథమ్

మచిలీపట్నం

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

పోర్టురోడ్డు, న్యూస్‌టుడే: తెలుగుభాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకూ ఈడేపల్లి భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రదర్శలు ఉంటాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయం

రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు

కోనేరుసెంటరు, న్యూస్‌టుడే: పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడితో కలిసి ఆదివారం సర్కారుతోటలో రూ.6.19 కోట్లతో నిర్మించిన సర్వీస్ రిజర్వాయర్ పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం చిలకలపూడిలో రూ.1.27 కోట్ల అంచనాతో నిర్మించనున్న సర్వీస్ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సర్కారుతోటలో రిజర్వాయర్ పనులను ఏడాదిలో పూర్తిచేసినప్పటికీ పంపుల చెరువు వద్ద నుంచి పైప్ లైను నిర్మాణం విషయంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. 4, 6 వార్డులతో పాటు 3, 5 వార్డులో కొంత భాగానికి తాగునీరు సరఫరా చేసేందుకు రిజర్వాయర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం తరకటూరు నుంచి పైప్‌లైను ఏర్పాటు చేసే విషయంలో చూపిన అశ్రద్ధ కారణంగా పట్టణంలో తాగునీటి కొరత ఏర్పడిందని, దాన్ని అధిగమించేందుకు తమ ప్రభుత్వం రూ.20కోట్ల అంచనా వ్యయంతో కొత్తపైప్‌లైను ఏర్పాటుచేసిందని చెప్పారు. ఒక్క తెదేపా ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ మంగినపూడి బీచ్ రహదారిని రూ.13కోట్లతో నాలుగులైన్ల రహదారిగా విస్తరిస్తున్నామన్నారు. త్వరలో రూ.15కోట్లతో కెన్నెడీ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి నిమిత్తం రూ.68కోట్ల అంచనాలతో త్వరలోనే టెండర్లను పిలవనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బీఎఫ్ఐడీ నిధులతో గతంలో పట్టణంలో 800కు పైగా రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి పరచిన విషయాన్ని గుర్తుచేశారు. మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ సర్కారుతోటలో 800 కిలో లీటర్ల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను ఏర్పాటుచేశామన్నారు. పార్టీ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కాశీవిశ్వనాథం, కమిషనర్ జశ్వంతరావు, పార్టీ నాయకులు చిలంకుర్తి తాతయ్య, వాలిశెట్టి బాబు, చలమలశెట్టి రమేష్, ఇలియాస్‌పాషా, కుంచె నానితో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రిజర్వాయర్‌ను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్సీ తదితరులు

పట్టణంలో మూడు అన్న క్యాంటీన్లు

భాస్కరపురం, న్యూస్‌టుడే: పట్టణంలో మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పట్టణ పరిధిలోని టౌన్‌హాలులో పార్టీ పట్టణ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి చేరువచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పక్కా గృహాలు లేనివారికి గూడు కల్పించే క్రమంలో నియోజకవర్గంలో మొత్తం 6,500 ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలో శంకుస్థాపన చేసే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఇంటింటికీ తెదేపా చేపడుతున్నట్లు చెప్పారు. దీనిలో ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా ముందుకు సాగుతామని వివరించారు. వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని నూతన కమిటీలకు సూచించారు. పురపాలక సంఘ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ పట్టణానికి అవసరమైన తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రతి నాలుగు వార్డులకు ఓ రిజర్వాయర్ చొప్పున నిర్మిస్తున్నామని, వీటిలో కొన్ని ముగింపు దశకు వచ్చాయని మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నట్లు, ఇంకొన్ని శంకుస్థాపన చేయాల్సి ఉన్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌పాషా, సీనియర్ నాయకుడు చిలంకుర్తి తాతయ్య, ప్రధాన కార్యదర్శి కాంతారావు, వైస్‌ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, కౌన్సిలర్లు నారగాని ఆంజనేయప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, బత్తిన దాసు, కోఆప్షన్ సభ్యుడు గనిపిశెట్టి గోపాల్, బోలెం హరిబాబు, సులేమార్, రాజేంద్రప్రసాద్, తులసీదాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ కబుర్లు

భాస్కరపురం,న్యూస్‌టుడే: పట్టణంలోని చిలకలపూడి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న ప్రాంతంలో రహదారికి దగ్గరగా గృహాలు నిర్మిస్తున్నారు. దీనివల్ల డ్రైనేజీ ఇరుకుగా మారుతుంది. మురుగు నీరు సక్రమంగా పారదని పలువురు ఆరోపిస్తున్నారు.

★ స్థానిక పాండురంగస్వామి దేవాలయం వద్ద ఉన్న వేగనిరోధకం దెబ్బతింది. నూతనంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. భారీ వాహనాలను రాత్రి సమయంలో అనుమతించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

★ కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు కుంగిపోయింది. లక్ష్మణరావుపురం జిలానీ బడ్డీకొట్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

★ చిలకలపూడి పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ప్రయాణికులకు అడ్డుగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాన్ని పక్కకు జరపాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

చేతి పంపునకు మరమ్మతులు



భాస్కరపురం,న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడికి పురపాలక సంఘం గడిచిన వేసవిలో సుమారు 300 బోర్లు వేసి, వాటికి బోరింగు పంపులు ఏర్పాటు చేసింది. వాటిలో కొన్నింటిని కొందరు ఆకతాయిలు పంపుల హ్యాండిళ్లు విరగ్గొట్టారు. చేతి పంపులకు హ్యాండిళ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ 'ఇదేమి పని' శీర్షికన శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, సర్కిల్‌పేటలోని చేతి పంపునకు మరమ్మతులు జరిపి నూతన హ్యాండిల్ ఏర్పాటు చేశారు.

రాజీవ్ సేవలు స్ఫూర్తిదాయకం

పోర్టురోడ్డు, న్యూస్‌టుడే: అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి అతిపిన్న వయసులోనే ప్రధానమంత్రిగా సేవలందించిన రాజీవ్‌గాంధీ సేవలు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి రామిశెట్టి ప్రసాద్ అన్నారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని రైతుబజార్ సమీపంలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ రాజీవ్ తన పరిపాలనా కాలంలో దేశంలో శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని శ్లాఘించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బుల్లెట్ ధర్మారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు కుమారి, బండారు సాంబశివరావు, ఇసాక్, అఫ్జల్‌బేగ్, పేరిశెట్టి నాగరాజు, కల్లు వెంకటేశ్వరరావు, అమ్మాజీ, కూరాళ్ల రాజా, ప్రవీణ్, రజియా సుల్తానా, హైదర్, గౌస్‌షరీఫ్, ప్రసాద్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

భాస్కరపురం,న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మైనార్టీలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌసియాబేగం కోరారు. స్థానిక సుకర్లాబాదలోని ఆమె కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసియాబేగం మాట్లాడుతూ అర్హులైన ముస్లిం మహిళలకు వివాహ సమయంలో దుల్హన్ పథకం కింద రూ.50 వేలు, విదేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు రూ.10లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు. మసీదుల్లో ఉండే గురువులకు, ఇమాంలకు రూ.5వేలు, మోజన్‌లకు రూ.3వేలు ప్రతి నెలా ఇవ్వనున్నారన్నారు. అర్హులైన ముస్లింలకు రుణాలు ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని వివరించారు. సమావేశంలో 10వ వార్డు కన్వీనర్ షేక్ అమీర్‌బాషా, షేక్ హుస్సైన్,మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ షేక్ గౌసియాబేగం

విద్యార్థికి ఆర్థిక చేయూత

భాస్కరపురం,న్యూస్‌టుడే: చదువులో ముందుండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థికి పట్టణంలోని బలరామునిపేటకు చెందిన ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘం తోడుగా నిలిచింది. హైదరాబాదుకు చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పట్టణంలోని ఎస్వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యనభ్యసిస్తున్న ఆకుల శ్రీపతి కుమారుడు సాయినిఖిల్‌కు, కళాశాల ఫీజుల నిమిత్తం రూ.18 వేలు చెక్కు రూపంలో సంఘ సభ్యులు చేతుల మీదుగా, విద్యార్థికి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి నాయిని లక్ష్మణగాంధీ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులు పది మందికి సహాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డా. కోకాశివప్రసాద్ అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు మరకాని మంగపతిరావు, ఉపాధ్యక్షుడు అంకాల వెంకటసుబ్బారావు, కార్యదర్శి ఆకునూరి నాగేంద్రరావు, సభ్యులు రాము, సత్యనారాయణ, శ్రీనివాస్, రాంబాబు, మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందిస్తున్న ఆదివెలమ సంఘ నాయకులు, తదితరులు

రైతుబజారులో నిన్నటి ధరలు

వంగ 28, బెండ 18, దొండ 22, టమాట 40, సొర 08, 10, దోస 14, బంగాళదుంప14, పచ్చిమిర్చి 22, బీర 14, బీట్‌రూట్ 18, బీన్స్ 50, అలసందలు 20, చిలకడ దుంప 26, క్యాబేజీ 20, అరటికాయ 7, 8, మునగ 05, 04, చామ 26, కాకర 12, కంద 24, కీరదోస 20, క్యాప్సికం 48, ఉల్లి పాయలు 22, క్యారెట్ 46, కొత్తిమీర 10, 05, గోరుచిక్కుడు 20 సోమవారం ఉదయం 7గంటలవరకు మాత్రమే ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి ల్యాండ్‌ఫోన్ 220100కు చేసి సంప్రదించవచ్చు.

'ఆనందసూర్య సేవలు మరువలేనివి'

పోర్టురోడు, న్యూస్‌టుడే: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనందసూర్య బ్రాహ్మణులకు అందిస్తున్న సేవలు మరువలేనివని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కోఆర్డినేటర్ పీవీ ఫణికుమార్ అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య జన్మదిన వేడుకలు పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజలు, హోమాలు జరిపించారు. అన్నపూర్ణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి సమక్షంలో కేకు కత్తిరించారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జిల్లా అధ్యక్షుడు మోపర్తి సుబ్రహ్మణ్యం, ఆర్‌బీఎస్ సభ్యులు చోడవరపు ప్రసూన, లలిత, అంబటిపూడి నాగలక్ష్మి, సుబ్రహ్మణ్యం, వెంట్రప్రగడ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకురాలు కరెడ్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం

నూతన కార్యవర్గ నియామకం

పోర్టురోడ్డు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ బందరు ప్రఖండ కార్యవర్గ నియామకాన్ని ఆదివారం చేపట్టారు. బందరు ప్రఖండ అధ్యక్షుడిగా సిద్ధినేని సత్యసాయిబాబు, ఉపాధ్యక్షుడిగా చేవూరి రమేష్, కొనకళ్ల వెంకటరత్నంలు నియమితులయ్యారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి అల్లూరి లక్ష్మీకాంతారావు, జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కబేళా పునఃప్రారంభం



కబేళాను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ బాబాప్రసాద్, తదితరులు

భాస్కరపురం,న్యూస్‌టుడే: ఇచ్చిన మాట తప్పడం తెదేపా నాయకులకు తెలీదని మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో కొంతకాలంగా మూతపడి ఉన్న కబేళాను మరమ్మతులు చేయించి ఆదివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5. 40లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. కబేళాలో వ్యాపారులకు కావాల్సిన వసతులు షెడ్, నీటి సరఫరా, రంగులు, విద్యుత్తు సరఫరా,మోటారు, డ్రైనేజీ తదితర సదుపాయాలు కల్పించామని చెప్పారు. మాంసం విక్రయదారులు, దుకాణదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందించడమే తమ ప్రధాన లక్ష్యం అన్నారు. మరికొద్ది రోజుల్లో మరో షెడ్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 25,28 వార్డుల కౌన్సిలర్లు సైకం శ్రీను, నారగాని ఆంజనేయప్రసాద్, తెదేపా నాయకుడు షాజహాన్,జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వర్కింగ్ ఛైర్మన్ తలారి సోమశేఖర్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

భాస్కరపురం,న్యూస్‌టుడే: తపాలా శాఖలో ఆల్ఇండియా గ్రామీణ డాక్ సేవక్‌లు ఈ నెల 16 నుంచి సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ సమ్మె ప్రభావం ప్రజలపై పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం తపాలా సూపరింటెండెంట్ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా మెయిల్ ఆగిపోకుండా, సేవింగ్స్ బ్యాంక్, సుకన్య సమృద్ధి ఖాతా, బీమా ప్రీమియం తదితర సేవలకు ఏ ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

దివ్యాంగుడికి చిరంజీవి ఫౌండేషన్ చేయూత

మల్లంపూడి (బంటుమిల్లి), న్యూస్‌టుడే: స్థానిక మోటారు మెకానిక్, ప్రత్యేక ప్రతిభావంతుడు (దివ్యాంగుడు) కర్రె ఏసుబాబుకు చిరంజీవి హెల్ప్ ఫౌండేషన్ చేయూత అందించింది. ఏసుబాబుకు ఒక బడ్డీ, కొన్ని మోటారు బైకు పరికరాలు, మరమ్మతుల సామగ్రిని సంస్థ ప్రతినిధులు ఉచితంగా అందజేశారు. కాళ్లు చచ్చుపడిన ఆయన మోటారు వాహనాలను మరమ్మతు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన బడ్డీలోకి సులభంగా వెళ్లే విధంగా, మరమ్మతులు సులభంగా చేసుకునే విధంగాను బడ్డీని తయారు చేయించి ఇచ్చారు. రెండు రోజుల్లో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు రానుండగా, అంతకు ముందే ఆదివారం గ్రామంలో వేడుకలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు దొండపాటి చక్రధర్, ఈశ్వర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కర్రపుల్లలే దిక్కు..

ట్యాప్‌లు లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

న్యూస్‌టుడే-పోర్టురోడ్డు: పురపాలక సంఘ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా పరిణమించింది. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటుచేయకపోవడం వల్ల ఎంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది. మచిలీపట్నం పురపాలక సంఘ పరిధిలో మొత్తం 42 వార్డులుండగా వాటిలో రమారమి 1.80లక్షల జనాభా నివసిస్తోంది. ఈనేపథ్యంలో దాదాపు ప్రతి వీధిలోనూ పబ్లిక్ కుళాయిలు ఏర్పాటుచేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ కొన్ని వార్డుల్లోని కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటుచేయడం విస్మరించారు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకుగాను ప్రజలకు కర్రపుల్లలే దిక్కవుతున్న పరిస్థితి ఉంది. ఇంటి వద్ద సొంత కుళాయి లేని వారు ఉదయం వేళల్లో పబ్లిక్ కుళాయిల వద్ద నీరు పట్టుకుంటుంటారు. ఆ సమయంలో అధిక శాతం నీరు వృథాగా పోతుంది. ట్యాప్‌లు ఏర్పాటుచేస్తే కచ్చితంగా నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయవచ్చనేది ప్రజల ప్రధాన వాదన. అసలే నీటి ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో తాగునీటిని ప్రాణసమానంగా చూసుకోవాలి. ఈ పరిస్థితుల్లో పురపాలనాధికారులు వహిస్తున్న నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాపులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



25వ వార్డు కబేళా వద్ద కర్రపుల్ల అడ్డుగా ఉంచిన పబ్లిక్‌కుళాయి



ఇనుగుదురుపేటలో ..



31వ వార్డు రామాలయం వద్ద

సమస్యలతో సహవాసం

భాస్కరపురం,న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని లక్ష్మణరావుపురంలో ప్రజలు ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేస్తున్నారు. సక్రమమైన రహదారులు లేవు, మురుగుపారడానికి డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఫలితంగా స్థానికుల బాధలు పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. పాలకులు మారుతున్నా తమ పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినపుడు కంటితుడుపు చర్యగా ఉన్న రోడ్లపై రబ్బిష్ వేయడం తప్ప వాటికి శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. ఏళ్ల తరబడి రాళ్లు పైకి తేలి నడవడానికి కష్టంగా ఉంటుందని వాపోతున్నారు. స్థానికుల గృహాల నుంచి వాడుకనీరు, మురుగునీరు పారడానికి సక్రమమైన మార్గం లేక ఇళ్ల ముందే గుంతలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షాలు పడితే ఇక స్థానికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ఎక్కడికి కదలలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. శివారు ప్రాంతం కావడంతో పట్టణంలో కురిసిన వర్షం నీరు ఇక్కడకి చేరుతుంది. దాంతో ఈ ప్రాంతం అంతా ముంపుబారిన పడుతుందని స్థానికులు తెలుపుతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, పాలకులు తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.



రాళ్లుపైకి తేలిన రోడ్డు

మణిమేశ్వరంలో ముగిసిన గంగానమ్మ సంబరం

మణిమేశ్వరం (బంటుమిల్లి), న్యూస్‌టుడే: గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గంగానమ్మవారి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని నైవేద్యం సమర్పించారు. భక్తులు మేళతాళాలు, కనకతప్పెట్ల వాద్యాలతో చిందులు వేసుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. సంబరం నేపథ్యంలో గ్రామంలో ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో నిండిపోయింది. పొరుగు పట్టణాల్లో ఉన్న ఆడపడుచులు వచ్చి సంబరాల్లో పాలుపంచుకోవడంతో సందడి నెలకొంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: సీతనపల్లి పంచాయతీ సంగమూడి సమీపంలో ఉన్న ఆచంట రంగనాయకులు ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ లోవరాజు తెలిపిన వివరాల ప్రకారం సంగమూడి సమీపంలో 216 జాతీయ రహదారి పక్కనే ఉంటున్న రంగనాయకులు హైదరాబాద్ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో పనిచేసే వ్యక్తి శనివారం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో వెంటనే ఇంటి యజమానికి సమాచారం అందించారు. హైదరాబాద్‌లో ఉన్న రంగనాయకులు హుటాహుటిన శనివారం సాయంత్రానికి ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఇంట్లోకి దొంగలు ప్రవేశించి రెండు కాసుల బంగారం, పదివేల నగదు, ఎల్‌సీడీ టీవీని దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం మచిలీపట్నం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. గతంలోనూ రెండు సార్లు ఇదే ఇంట్లో దొంగతనాలు జరిగాయని రంగనాయకుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'స్వర్ణ కిరీటం' రూపకర్తలకు ఘన సత్కారం



స్వర్ణకారుని దంపతులను సత్కరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

పెడన, న్యూస్‌టుడే: స్వర్ణకిరీటధారిణి, పెడన పట్టణ దేవత పైడమ్మవారి నూతన శోభను తిలకించేందుకు ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. గత శుక్రవారం కిరీటాన్ని అలంకరించిన అనంతరం భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు. రూ. 25 లక్షల విలువైన స్వర్ణకిరీటం భద్రతకు సహకార బ్యాంకులో లాకర్‌తోపాటు ఆలయంలో ప్రత్యేకంగా మరో లాకర్‌ను ధర్మకర్తల మండలి ఏర్పాటు చేసింది. ఆలయంలో సీసీ కెమెరాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని ఈ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు చెప్పారు. స్వర్ణకిరీటం సాధనకు కృషి చేసిన పలువురు ప్రముఖుల్ని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తెనాలికి చెందిన స్వర్ణకారుడు, కిరీట రూపకర్త బియ్యపు హరికృష్ణ దంపతులతోపాటు మాజీ ఛైర్మన్ వేణుగోపాలరావు, ఆలయ ఛైర్మన్ తోట నాగేశ్వరరావు, ఆసాది తోట రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు నాగ ధనమోహనరావు, శ్రీకాకుళపు సుబ్బారావు, వూటుకూరి ప్రకాశరావు, పడవల పైడేశ్వరరావు, పురప్రముఖులు తమ్మన సుబ్బారావు, తోట పైడేశ్వరరావు, కౌన్సిలర్ యర్రా నాగరాజు తదితరులను ఘనంగా సన్మానించారు.

EENADU CLASSIFIEDS

IRON & CEMENT, EYE CARE, COOKING,FLOORINGS, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURERS, DRIVING SCHOOLS, TAILORING, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESSCELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

AUTOMOTIVE

టాటా మోటార్స్ ఫైనాన్స్ వారి విజయవాడ, వైజాగ్, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి Used వెహికల్స్ యొక్క బహిరంగ వేలము విజయవాడలో హోటల్ మనోరమలో 22-8-17న జరుపబడును. వాహనాల వివరాలు: టాటా ఏస్, ఇండికా, LPT: లారీలు, సంప్ర: ✆ 9133604568, 9920327058, 9885843173, 9177492599, cartrade.com.

BUSINESS SERVICES

READYMADE & TEXTILES

బ్లౌజు బిట్స్
2×2 జకార్డ్ .80cm ~~127/-~~ 50/-
లోటస్ పట్టు .80cm - 3 పీ. 100/-
మంగళగిరి జకార్డ్ .80cm - 60/-
లేటెస్ట్ మోడల్స్‌లో గోల్డ్ టిష్యూ జకార్డ్ కలంకారీ, పోచంపల్లి
సూర్య కట్ పీసెస్
కళానికేతన్ ప్రక్క సందు, బందరురోడ్, VJA-10
ఫోన్: 0866-2483922/23

BUSINESS OFFER

థర్మాకోల్ & పేపర్ ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజినీరింగ్ కం॥, విజయవాడ. 88972 67259.

ప్లాస్టిక్ పరిశ్రమ. మెషిన్లు అమ్మకం, ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం, నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 57528.

SERVICES

GST, రిటర్నులు, రిజి వేబిల్లు, PAN, లేబరు కొరకు BK ట్యాక్స్, కన్సల్టెంట్, GST శిక్షణ రుసుము కేవలం 500/- ✆ 99087 28808

EDUCATION

DISTANCE EDUCATION

Admission Notification: Direct Final Year to Degree & PG (All Courses), Diploma All. Exams Shortly ✆ 8801138000/ 7416256291

HOME NEEDS

MOSQUITO SCREENS

Image **మస్కిటోనెట్స్** డోర్స్ & విండోస్, మాడ్యులర్‌కిచెన్, చిమ్నీ + Hobs @ పాలిక్లినిక్‌రోడ్, బెంజిసర్కిల్ దగ్గర VJA ✆ 98494 23555, 98661 56677.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీలలితా హోమ్ కేర్ & నర్సింగ్ సర్వీసెస్, వృద్ధులకు, బెడ్ పేషంట్లకు 24 గం॥లు మీ ఇంటి వద్దనే అన్ని రకముల సేవలు, ఆయాలు, నర్సులు, అటెండర్లను పంపబడును. ✆ 96032 49911/22

బాలాజీ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్ వృద్ధులు, బెడ్‌పేషంట్లకు 24 గం॥ మీ ఇంటి వద్దకు అన్నిరకముల సేవలు చేయుటకు ఆయాలు/ అటెండర్లను పంపగలము. ✆ 95051 41177, 99126 01177.

REAL ESTATE

A.P.రాజధాని , రైతులకు, పూలింగ్‌లో ఇచ్చిన ప్లాట్లు గ॥9000/- కమర్షియల్ గ॥. 12,200/- రాజధానికి 5kmలో గ॥5000/- మంగళగిరిలో గ॥15000/-. ✆ 93939 30419.

FLAT FOR SALE

35 లక్షలకే విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి అతి దగ్గరలో 2 BHK & 3 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. NTR హౌసింగ్ సంప్ర: 92464 82022, 94401 20033, 73372 43565.

నిడమానూరు: Highway కు వాక్‌బుల్‌గా E/F, ఫర్నిష్డ్ 2 BHK (880 + 200 S.Ft) Flats 40 చ॥గ॥లతో అన్ని సౌ॥తో ✆ 94401 90273, 94401 51423.

పోరంకి – నిడమానూరు రోడ్డుకు ఆనుకుని N&E ఫేసింగ్, ఫర్నిష్డ్ 2 BHK (1270 S.Ft) & 3 BHK (1620 S.Ft) Flats అన్ని సౌ॥తో అమ్మకం. ✆ 98499 97575.

2BHK Budjet Flats in Ramavarappadu & Nidamanuru for Sale. Loan Facility available. ✆ 91004 42651, 91004 42642.

1 BHK Flat, 450 SFT ఎ @ రైల్వేస్టేషన్‌కు 1.5 KM దూరంలో, అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలదు. Contact: Dr.Racky: 9885335459

ప్రసాదంపాడు St.Anns స్కూల్ దగ్గర గ్రౌండ్ ఫ్లోర్ 2 BHK 805 S.Ft. బైక్ పార్కింగ్‌తో గృహప్రవేశానికి సిద్ధం. కేవలం 28 లక్షలకే. ✆ 97054 14445.

HOUSE FOR SALE

41 లక్షలకే ఇండివిడ్యువల్ హౌస్‌లు & డూప్లెక్స్ హౌస్‌లు 80% లోన్ సౌ॥తో ★ VJA సిటీ పరిధిలో ★ బందరు రోడ్డుకి దగ్గరగా అమ్మకం. ✆ 94926 74836.

41 లక్షలకే Benz Circle కు 12 KM పరిధిలో 183 చ॥గ॥లో నిర్మిస్తున్న ఇండివిడ్యువల్ & Duplex హౌస్‌లు 80% Loan సౌక॥తో అమ్మకం. ✆ 80961 23123.

PLOT FOR SALE

కృష్ణాజిల్లా, అమరావతికి దగ్గర, కంచికచర్ల సమీపములో చ.గ. 2000/- రూ. నుండి పూర్తి డవలప్‌మెంట్స్ ప్లాట్లు అమ్మకం. స్పాట్ Reg. ✆ 81431 13399.

Vijayawada: అమరావతి AP CRDA అప్రూవ్డ్ 114 ఎ॥ల Mega వెంచర్ రాజధాని హద్దుగా మంగళగిరి దగ్గరలో (114 ఎ॥ల Lay అవుట్ మధ్యగా Kaza Toll గేట్ నుండి సెక్రటేరియట్‌కు 164 అ॥ల వెడల్పు గల సీడ్ క్యాపిటల్ Road కలదు) 183 & 1000 చ॥గ॥లలో Plots & Villas 50% LIC Loan సౌ॥తో అమ్మకం. ✆ 90596 95755.

విజయవాడ – గుంటూరు మధ్య మంగళగిరి సమీపంలో Sunrise Projects. గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ప్లాట్లు. AP CRDA, RERA నిబంధనలతో LEPL వారి సౌజన్యంతో. రఫీ. 99661 49858.

ఫ్లాష్... ఫ్లాష్.. అమరావతి & ORR కు దగ్గర 100 చ॥గ॥ 3.50 లక్షలు & గన్నవరం, నూజివీడులలో GPA - CRDA ప్లాట్లు కలవు. ఓపెనింగ్ ఆఫర్ 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. ✆ 89858 22844.

ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్, IT మేధ, ORR జంక్షన్‌కి దగ్గర్లో నివాసాలు, విద్యాసంస్థలకి మధ్య చ॥గ॥ 6,000/- & 8,000/- మాత్రమే. ✆ 77801 60699, 98496 51607.

అమరావతి – విజయవాడ రహదారిలో మద్దూరు గ్రామ కంఠంకంలో ఇన్నర్‌రింగ్ రోడ్‌ను ఆనుకొని, పూలింగ్ ల్యాండ్, సచివాలయానికి అతి దగ్గరలో CRDA అప్రూవల్ ప్లాట్లు కలవు. 98481 84569.

REPAIRS

కేశవ ఎలక్ట్రానిక్స్ Samsung, Sony, LG, LED, LCD అన్ని కంపెనీల TVలను మీఇంటి వద్దనే రిపేరు చేయబడును మరియు అమ్మబడును/ కొనబడును. ✆ 93932 63555.

TO-LET

3 BHK Duplex House Fully Furnished with 3 A.C, Bhavanipuram, Vijayawada. ✆ 94403 15455.

JOBS

Wanted Office Executive Female. Qly: Deg, Good C/M Skills. Good Looking. Wanted Plant & Machinery Mechanical Eng with Diploma 3 to 5Yrs Exp, in Construction Field with Good Knowledge in Commercial/Industrial Projects. Interview on 21-8-2017 CV2 hr@rtechpl.com. Ph: 08645-274126, 274127.

ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు చదువుతో నిమిత్తం లేకుండా Male/Female మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + కమీషన్ ✆ 94907 89174, 91332 95777.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి కంకిపాడు, చినఓగిరాలలో ఉన్న రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్ముటకు టీమ్‌లీడర్స్ కావలెను. కమీషన్ + ఇన్సెంటివ్స్. ✆ 86860 23039.

విజయవాడలో నూతనముగా ప్రారంభించనున్న Training Instituteలో Revit, Arcgis, Etabs, Erdas, Softwares Teaching కొరకు తెలిసిన స్త్రీ/పు కావలెను. వయస్సు పరిమితి లేదు. సంప్ర॥ ✆ 73370 50533.

స్వగృహఫుడ్స్‌లో పనిచేయుటకు కిచెన్ సూపర్‌వైజర్స్ కావలెను. వయస్సు 30 to 50 సంవత్సరాలలోపు. సంప్ర: 99498 45000.

Wanted Centre Associate at Grow PWD VIJ, Preferable MSW (or) 2 + Exp in Marketing. vacancys.india@gmail.com ✆ 70329 01647.

Sales Executives with at least 2 Years experience in any Consumer Durable Product. Should have fluency in MS Word & MS Excel. Two Wheeler with Licence. Contact: Feather Lite, Nandamuri Road, Behind MBS Jewellers, M.G. Road, Vijayawada. On Tuesday, 22nd Aug. 2017 ✆ 98666 33048.

Wanted Front Office Executives, Stewards & Captains for 3 Star Hotel in Vijayawada. Phone. 88855 12491.

Wanted Teachers. High School Hindi, Social Studies & Primary English. NBL Jain School, Vijayawada-1. ✆ 0866 - 2560490, 83339 32485.

Required Male Office Assistants and Telecallers for Education Institute. Call: 89771 73173.

Accountant (Sr/ Jr) HR Exe/ Store Manager/ Civil Engineers/ Hardware/ Net Working/ Telecallers/ Sal: 7K to 35K. ✆ 0866-6641333.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలో మీ ఖాళీ టైంలో 3 లేక 4 గంటలు Work చేస్తూ 15,000 సంపాదించే అవకాశం. Age: 20+ ✆ 90141 54444.

అంపాపురం, జూపూడి రిలయన్స్ పెట్రోల్ బంక్స్‌లో పనిచేయుటకు షిఫ్ట్ సూపర్‌వైజర్స్, DSM హ్యాండీ మాన్స్ కావలెను. ఆకర్షణీయ జీతం. ✆ 70131 04547, 87900 53030.

ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు సెక్యూరిటీలో అనుభవము కల్గిన ఫీల్డు ఆఫీసర్ కావలెను. ✆ 94944 59109, 94412 00297.

Wanted Lady Teachers 6th-10th, Social & English ★ ఆయాలు కావలెను. Ideal English Medium School, Ramanatham Street, Kasturibaipet, VJA-10 ✆ 0866-6615151.

గృహిణులకు, మహిళలకు మాత్రమే. డిగ్రీ/ పీజి, 30 - 50 సం. లోపు (P/F), విజయవాడ ఆఫీసునందు మీకు నచ్చిన పనివేళలలో. Sal/ Inc. ✆ 99855 52727.

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలో పనిచేయుటకు Drivers కావలెను. Contact: 92464 55455.

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు X to PG అర్హత గల అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఉచిత భోజన వసతి కలదు. Cell. 85109 73559, 85109 73845

బ్యాంకు అనుబంధ సంస్థలో పని॥ డేటా ఎంట్రీ అ॥ 10K, సాఫ్ట్‌వేర్ కం.లో H.R Fre./ Exp. 10 to 20K., ఫ్రంట్ ఆఫీస్ - 12K, S/W డెవలపర్స్ M.C.A, B.Tech (All) - 15K, అకౌంటెంట్స్ - 20K, హౌస్ కీపింగ్, సూ॥వై॥ ✆ 95058 38531.

ప్రముఖ IT కంపెనీ నందు వర్క్ చేయుటకు డిగ్రీ అర్హత, కంప్యూటర్ నాలెడ్జి కలిగిన Male అభ్యర్థులు కావలెను. 80084 79479.

షిప్‌పై ఉద్యోగం 10th పాస్ అయినా యువకులు మర్చంట్ నేవీలో చేరండి మంచి ఉద్యోగం ఉత్తమ జీతము వయస్సు 17.5-25 సం॥లు Ph: 09632455221

ఇబ్రహీంపట్నంలో ప్రముఖ HP పెట్రోల్‌బంక్‌లో పనిచేయుటకు పంపు బాయ్స్, లేడీస్ కావలెను. ఏదైనా బంకులో పనిచేసిన వార్కి ప్రాముఖ్యత. ✆ 99595 52902.

వివిధ కంపెనీల పెయింట్స్ సేల్స్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. Q: 10th/ Inter, జీతం: 7,500/- ✆ 98850 51226.

విజయవాడ C.M.R ఎంటర్ ప్రైజెస్‌లో పనిచేయుటకు అనుభవం గల డెలవరి బాయ్స్ మరియు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన డేటా ఆపరేటర్ కావలెను. ✆ 88976 65542.

విజయవాడలో రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు అనుభవం గల సీనియర్ అకౌంట్స్ మేనేజర్ కావలెను. ✆ 88856 85599.

ప్రముఖ ఆర్కిటెక్ ఆఫీసులో పనిచేయుటకు B.Tech Civil చదివి Auto CAD సివిల్ తెలిసిన, అనుభవం ఉన్నా/ లేని అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. ✆ 93973 41745.

డాటా ఎంట్రీ వర్క్స్. కంప్యూటర్ ఉన్నవారికి పార్ట్/ ఫుల్‌టైం పేజ్ టైపింగ్ వర్క్స్ కలవు. నెలకు 8K-16K సంపాదించే అవకాశం. పేజ్‌కు రూ॥ 80/-. సంప్ర॥ 7396608891.

ప్రముఖ ఆటోమొబైల్ ఫైనాన్స్ కం.లో పనిచేయుటకు లేడి టెలికాలర్. అ: ఇంటర్/ డిగ్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ (2 వీలర్, 4 వీలర్ బిజినెస్ కోసం) అ: డిగ్రీ విత్ 2 వీలర్ కలిగి ఉండాలి. సంప్ర: కీర్తి ఫైనాన్స్, 1వ లైను, భావాజీపేట, విజయవాడ-3, సంప్ర: 91330 25777, 92469 22778.

DRIVERS

విజయవాడలోని Air Port నందు పనిచేయుటకు టాక్సీ బాడ్జ్ & ట్రాన్స్‌పోర్టు లైసెన్స్‌తో అనుభవం గల డ్రైవర్లు కావలెను. వసతి కలదు. ✆ 0866 - 2554501.

SECURITY GUARDS

విజయవాడ, బెంజిసర్కిల్ దగ్గరలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీ: 12 గం. - 10 వేలు, 8 గం. - 7,500/- & సూపర్‌వైజర్స్ సంప్ర. ✆ 77996 54555/ 98856 94555.

TOURS & TRAVELS

కావేరి పుష్కరాలు, మొదటి రోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే 20 క్షేత్రాలు గోవా & కర్ణాటక AC యాత్ర Sep 4న & రామేశ్వరం 30 క్షేత్రాలు AC యాత్ర Sep 15న, దసరాకి Sep 26న పూరి 5 రో॥యాత్ర లక్ష్మీటూర్స్. ✆ 98662 46466.

కావేరిపుష్కరాలు, శ్రీరంగం, మైసూర్, శృంగేరి, గోకర్ణం, మూకాంబిక 7 రో॥ 7200/- 10-9 & 15-9 ★ కాశి మినిటూర్, కాశి, ప్రయాగ. 3 రో॥ వ॥ భో॥ 3000/- sep-4 సత్యసాయి సేవాసమాజ్ 7674806567

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు

గొల్లపూడి, న్యూస్‌టుడే: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కృష్ణా జిల్లా పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడ గ్రామీణ మండలం కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యదర్శుల సర్వీసు రెగ్యులరైజేషన్‌లో తాత్సారం చేయడం తగదన్నారు. గ్రేడ్-3 కార్యదర్శుల సీనియారిటీ లిస్టు ప్రకటించాలన్నారు. కార్యదర్శులను కొందరు ఎంపీడీవోలు ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆనంద ఆదివారం నిర్వహణలో ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యదర్శుల సమస్యలపై జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతంకు సంఘం తరుపున వినతి పత్రాన్ని ఇస్తామని ప్రకటించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. సమావేశంలో విజయవాడ డివిజన్ అధ్యక్షుడు జి.బి.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.ఎస్.ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు ఎం.వి.దాస్, సంఘం సభ్యులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్లను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



సన్మానం అందుకున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెట్లతో జాయింట్ పోలీసు కమిషనర్ బీవీ రమణకుమార్, తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మాస్టర్ అథ్లెట్లను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు బీవీ రమణకుమార్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలోని జిల్లా మాస్టర్ అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెట్ల సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యువత చదువుపైనే దృష్టి పెడుతుందని, చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఏడు పదుల వయసు పైబడినప్పటికీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు దేశ ప్రతిష్ఠను ఇనుమడించే విధంగా అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఇటీవల మలేషియాలో జరిగిన ఆసియా మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 70+ కేటగిరీలో ఏవీసుబ్బలక్ష్మి రెండు పసిడి, రెండు రజత, 60+ కేటగిరీలో టి.పార్థసారథి ఒక పసిడి, రజతం, 45+ కేటగిరీలో పి. పద్మజ రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ టీవీరావు, జిల్లా మాస్టర్ అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు ముసునూరి రవి, వీవీసుబ్బారావు, కోశాధికారి ఆర్.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుమార్ గౌడ్ మృతికి సంతాపం

విజయవాడ సబ్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గానికి చెందిన ఏపీ జలవనరుల ఎపెక్సు కమిటీ సభ్యుడు, తుంగభద్ర ఎల్.ఎల్.సి. పీసీ ఛైర్మన్ కుమార్ గౌడ్ ఆదివారం రహదారి ప్రమాదంలో మరణించడం పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ ఎపెక్సు కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ, తూర్పు కృష్ణా, ఎన్‌ఎస్‌పీ పీసీల ఛైర్మన్లు గుత్తా శివరామకృష్ణ, యనమద్ది పుల్లయ్యచౌదరి తదితరులు సంతాపం తెలిపారు. కర్ణాటక నుంచి వస్తుండగా మార్గమధ్యంలో జరిగిన కారు ప్రమాదంలో కుమార్‌గౌడ్ మృతి చెందారు. కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి మృత్యువాత

ఆలయానికి వెళ్తున్నామని వసతి గృహం నుంచి బయటకు వచ్చిన నలుగురు స్నేహితులు

అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి, న్యూస్‌టుడే: దివిసీమ ముఖద్వారం పులిగడ్డలో మోపిదేవి వార్ఫునకు సమీపంలోని కాజ్ వే వద్ద కృష్ణానదిలో ఆదివారం స్నానానికి దిగిన నలుగురు పాలిటెక్నిక్ విద్యార్థుల్లో తూపాటి హరిప్రసాద్(16) ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడని ఎస్సై మణికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా పెద ఆరవీడు మండలం కర్రోల గ్రామానికి చెందిన తూపాటి హరిప్రసాద్ కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రపురంలోని దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం(కంప్యూటర్సు) చదువుతూ అవనిగడ్డలోని బీసీ కళాశాల విద్యార్థుల వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం కావడంలో హరిప్రసాద్ తన మిత్రులు డి.మోహన్ సాయి, జి.వెంకటేశ్వరరావు, ఎం.యుగంధర్‌తో కలిసి మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్నామని వసతి గృహంలోని వారికి చెప్పారు. నలుగురు కలసి పులిగడ్డలోని కృష్ణానదిలో కాజ్‌వే వద్ద స్నానంచేయడానికి దిగారు. హరిప్రసాద్ కొద్దిలోతు ప్రాంతంలో స్నానానికి దిగి రెండు సార్లు అటూ ఇటూ గంతులు వేసినట్లుగా మిత్రులు తెలిపారు. మిగిలిన వారు కాజ్‌వేకు దగ్గరలో స్నానం చేస్తుండగా హరిప్రసాద్ కనపడకపోవడంతో వారు భయంతో కేకలు వేశారు. వెంటనే అవనిగడ్డ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందటంతో ఎస్సై మణికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని హరిప్రసాద్ కోసం మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఖాదర్ బాషా ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మత్స్యకారులు పడవలో వలలతో గంటసేపు పైగా నదిలో గాలించగా హరిప్రసాద్ మృతదేహం లభించింది. హరిప్రసాద్ మృతదేహాన్ని చూడగానే సహచర విద్యార్థులు బోరున విలపించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించామని వారు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ చెప్పారు. శవ పరీక్ష కోసం హరిప్రసాద్ మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



కృష్ణానదిలో నుంచి హరిప్రసాద్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న మత్స్యకారుడు, సహవిద్యార్థులు



హరిప్రసాద్ మృతదేహం కోసం గాలిస్తున్న మత్స్యకారులు

సందిగ్ధంతో పంచనామా జాప్యం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : హరిప్రసాద్ మరణించిన ప్రదేశం అవనిగడ్డ పంచాయతీ పరిధిలోకి వస్తుందా లేదా మోపిదేవి మండలం నాగాయతిప్ప పరిధిలోకి వస్తుందా అనే సందిగ్ధంతో సంఘటన స్థలంలో పంచనామా నిలిచిపోయింది. తర్వాత ఆర్డీవో పి.సాయిబాబు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన వెంట వెళ్లిన ముగ్గురు విద్యార్థుల నుంచి కారణాలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలం అవనిగడ్డ పంచాయతీ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో అవనిగడ్డ వీఆర్వో శేషుబాబు పంచనామాకు చర్యలు తీసుకున్నారు. మృతుడు హరిప్రసాద్ తల్లిదండ్రులు వస్తేగాని శవపరీక్ష చేయడానికి అవకాశం లేకపోవడంతో సాయంత్రం 6 గంటల వరకు వేచి చూశారు. సోమవారం శవపరీక్ష చేస్తారని ఎస్‌ఐ మణికుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా స్విమ్మర్లు



రాష్ట్ర స్థాయి సీనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన జిల్లా స్విమ్మర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో వచ్చే నెల 10వ తేదీన నిర్వహించే 3వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లోపాల్గొనే జిల్లా జట్టును ఆదివారం గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఎంపిక చేశారు. జిల్లా ఆక్వాటిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ గల స్విమ్మర్లను ఎంపిక చేశామని ఆ సంఘం కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. సీనియర్ బాలుర విభాగంలో ఎం.లోహిత్, ఎం.వాసురామ్, ఎన్ఎన్‌డీఎస్ మణిదీప్, పి.నాగేశ్వరరావు, కె.యోవరాజ్, ఐఎస్‌వీ రాఘవ, వి.రాజేష్, జేఎస్‌శరశ్చంద్ర పాణి, బి.రవీంద్ర సాయినాథ్, ఆర్.గౌతమ్, జె. సైదులు, పి.ప్రవీన్‌బాబు, కె.సాయికాళి, బాలికల విభాగంలో ఆర్.ప్రవల్లిక, వి. సాయిశ్రీ, జ్ఞానేశ్వరి, వి.సాయిప్రియ, సుందరమూర్తి కీర్తనలు ఎంపికయ్యారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



చెరువులో మునిగిన కోటేశ్వరరావు కోసం గాలిస్తుండగా వచ్చిన గ్రామస్థులు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే : మొవ్వ, పామర్రు మండలాల్లో వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. మొవ్వ జేజే.నగర్ చెరువులో ఒక వ్యక్తి ఆదివారం సాయంత్రం మునిగిపోయాడు. మొవ్వ జేజే.నగర్‌లో గంగానమ్మ సంబరం అనంతరం ఊరేగింపు చేశారు. ఆ సమయంలో చెరువులో స్నానం చేసేందుకు దిగిన చేబ్రోలు కోటేశ్వరరావు(50) మునిగిపోయాడని స్థానికులు, ఆయన కుమారుడు రవి చెప్పడంతో స్థానికులు, యువకులు గాలింపు చర్యలు ప్రారంభించారు. రాత్రి 8 గంటల వరకు కోటేశ్వరరావు ఆచూకీ లభించలేదు. అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. సంఘటనా స్థలాన్ని కూచిపూడి ఎస్‌ఐ అనీల్, సిబ్బంది, మొవ్వ ఫైర్ అధికారులు, ఆర్‌ఐ కుమారి, వీఆర్వోలు, గ్రామ పెద్దలు మండవ రత్నగిరిరావు, బుజ్జికోటేశ్వరరావు, పాస్టర్ వేమూరి పరిశుద్ధరాజు, తెదేపా నాయకులు శీలం బాబూరావులతోపాటుగా గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకున్నారు.

పసుమర్రు(గ్రామీణ పామర్రు), న్యూస్‌టుడే : మండలంలోని పసుమర్రులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడని ఎస్.ఐ. బి. అభిమన్యు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లె కాంతారావు కుమారులు వల్లె కిశోర్ బాబు, విజయరాజులు పచారి సరకుల నిమిత్తం మోటారుసైకిల్‌పై గ్రామశివారు గంగులవానిచెరువు నుంచి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో దీనికితోడు వర్షం కురుస్తుండటంతో వాహనం అదుపు తప్పి పడిపోయారు. ఈ క్రమంలో మోటారుసైకిల్‌కి వెనుక కూర్చున్న కిశోర్‌బాబు(31)కి తలకు గాయమైంది. సమీపంలో ఉండి విషయాన్ని గమనించి తండ్రి కాంతారావు వెళ్లి ప్రశ్నించగా మోటారుసైకిల్ అదుపు తప్పిందని చెప్పారు. వెంటనే క్షతగాత్రుడిని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్సకోసం అక్కడ నుంచి విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడని ఎస్.ఐ. తెలిపారు. ఈ మేర కేసు నమోదు చేశామన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

★ న్యూరాజరాజేశ్వరిపేటలో అలముకున్న విషాదం

★ మృతదేహంతో సీపీఎం నాయకుల ధర్నా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ), న్యూస్‌టుడే : ఇంటి ముందు ఆడుకుంటూ అందరినీ ఆకట్టుకునే ఆ బాలుడు.. ఉన్నట్టుండీ జ్వరం బారిన పడ్డాడు. సాధారణ జ్వరంగా భావించిన తల్లిదండ్రులు.. స్థానిక ఆర్‌ఎంపీలను ఆశ్రయించి చికిత్స అందిస్తున్నారు. కానీ నాలుగో రోజున బాలుడ్ని మంచి ఆసుపత్రిలో చూపించేందుకు ప్రయత్నించినా ఆ తల్లిదండ్రులకు ఆ బాలుడు దక్కలేదు. ఆదివారం ఉదయం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

న్యూరాజరాజేశ్వరి పేట ప్లాట్ నంబరు 798లో నివసించే సోని, ధనుంజయలకు 10 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఒక కుమార్తె. నలుగురు కుమారులు. ధనుంజయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. నాలుగో సంతానమైన కె.యశ్వంత్(4) ఇంటి వద్దనే తల్లి వద్ద ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో సాధారణ జ్వరంగా భావించి స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చూపించారు. ఇంజక్షన్, మందులు రాసివ్వడంతో జ్వరం తగ్గింది. మళ్లీ మరుసటి రోజు జ్వరం రావడం ప్రారంభమైంది. మూడు రోజుల తర్వాత పరీక్షలు నిర్వహించాలని వైద్యుడి చెప్పిన మాటలకు సరేనని ఇంటి వద్దనే బాలుడికి వైద్యుడిచ్చిన మందులు వాడుతున్నారు. మూడో రోజు జ్వరం ఎక్కువ కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ రక్తపరీక్షలు నిర్వహించాలని ఆసుపత్రి వైద్యులు చెప్పడంతో డబ్బులు లేక ఇంటికొచ్చారు. మరుసటి రోజు ఉదయాన్నే ఆసుపత్రిలో పరీక్షలు చేయాలని అనుకున్నారు. అనుకోకుండా ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో బాలుడికి జ్వరం ఎక్కువై మృతి చెందాడు. ఏడేళ్ల క్రితం ఇదే కుటుంబంలో పెద్దకుమారుడైన చరణ్ కూడా జ్వరంతో మృతి చెందాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది బాలుడి ఇంటి ముందు బ్లీచింగ్ చల్లి వెళ్లిపోయారు.



బాలుడి మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో తల్లిదండ్రులు

సీపీఎం ధర్నా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు తల్లిదండ్రులను పరామర్శించి, బాలుడి మృతదేహంతో న్యూరాజరాజేశ్వరి పేటలో నడిరోడ్డుపై ధర్నాకుపక్రమించారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మండిపడ్డారు. జ్వరాలు ప్రబలుతున్నాయని హెచ్చరిస్తున్నా అధికారులు, పాలకులు స్పందించడం లేదన్నారు. ఈ బాలుడి మృతికి తెలుగుదేశం పార్టీ నాయకులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డి.విష్ణువర్ధన్, కె.దుర్గారావు, టి.శ్రీను, బి.రమణ, మణి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 88, రిటైల్ ధర - 103, చికెన్ విత్ స్కిన్ -144, చికెన్ స్కిన్‌లెస్ - 170
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర - 95, 103, 114 చికెన్ విత్ స్కిన్- 184, చికెన్ స్కిన్‌లెస్- 194

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59 పై॥. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

సినిమాకు తీసుకెళ్లలేదని భర్తపై అలిగి కాలువలో దూకిన భార్య

కాపాడిన పోలీసు కానిస్టేబుల్

విజయవాడ నేరవార్తలు/ సత్యనారాయణపురం, న్యూస్‌టుడే: సినిమాకు తీసుకువెళ్లలేదని భర్తపై కోపంతో అలిగి కాలువలోకి దూకిన యువతి... భార్యను కాపాడేందుకు కాలువలోకి దూకిన భర్త.... నీళ్లలో కొట్టుకుపోతున్న వారిద్దరినీ కాపాడిన పోలీసు... . ఆదివారం ఉదయం లెనిన్ సెంటరులో ఉత్కంఠను లేపిన సంఘటన ఇది. భార్యా భర్తలను కాపాడిన పోలీసు కానిస్టేబుల్‌పై పోలీసు అధికారులు ప్రశంసలు జల్లు కురిపించారు. వాంబే కాలనీకి చెందిన రాజారెడ్డి(20), తిరుపతమ్మ (19)లు భార్యా భర్తలు. వీరిద్దరూ ఆదివారం ఉదయం గాంధీనగర్‌కు వచ్చారు. సినిమాకు వెళ్లాలనే విషయంపై వారి మధ్య స్వల్ప వివాదం నెలకొంది. భర్త సినిమాకు తీసుకువెళ్లనని చెప్పడంతో అతనిపై కోపగించుకున్న తిరుపతమ్మ లెనిన్ సెంటరులోని వంతెనపై నుంచి రైవస్ కాలువలోకి దూకేయగా ఆమెను కాపాడేందుకు భర్త రాజారెడ్డి కాలువలోకి దూకారు. అయితే ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. అదే సమయంలో అలంకార్ సెంటరు ధర్నా చౌక్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఏపీఎస్పీ కానిస్టేబుల్ శ్రీనివాసరావు నీళ్లలో కొట్టుకుపోతున్న భార్యాభర్తలను గమనించి కాలువలోకి దూకి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఒక కార్యక్రమంలో ఉన్న జాయింట్ సీసీ బి.వి.రమణకుమార్ వద్దకు భార్యా భర్తలిద్దరినీ పోలీసులు తీసుకువచ్చారు. వారికి జాయింట్ సీపీ కౌన్సెలింగ్ చేశారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇద్దరి ప్రాణాలను కాపాడిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ శ్రీనివాసరావును జాయింట్ సీపీ రమణకుమార్, ఏసీపీ శ్రీనివాస్‌లు అభినందించారు.

స్వచ్ఛత... పచ్చదనం

విద్యాలయాల్లో పక్షోత్సవాలకు మార్గదర్శకాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

ప్రభుత్వ విద్యాలయాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం అమలుకు సెప్టెంబరు ఒకటి నుంచి 'స్వచ్ఛత పక్వాడా' అనే కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ అమలు చేయనుంది. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు దీనిపై మార్గదర్శకాలు జారీ చేశారు. నేటి విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటనే రేపటి సమాజం ఆరోగ్యదాయకంగా ఉంటుందనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు కచ్చితంగా పక్షోత్సవం నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.




ఇదీ ప్రతిజ్ఞ: నేను ప్రతిరోజు విద్యాలయానికి పరిశుభ్రంగా వస్తాను. నా తరగతి గదిని, విద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో నావంతు బాధ్యత నిర్వహిస్తాను. విద్యాలయ ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తాను. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు నావంతు కృషి చేస్తాను. ఆహార పదార్థాలను వృథాగా పారవేయనని, ప్రతి నీటి బొట్టును సంరక్షిస్తానని, వ్యక్తిగత మరుగుదొడ్లను సక్రమంగా వినియోగిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ స్వచ్ఛ సందేశాన్ని నా కుటుంబ సభ్యులకు, ఇరుగుపొరుగు వారికి అవగాహన పరచడం నా బాధ్యతగా భావిస్తాను.

నిర్వహించాల్సిన కార్యక్రమాలు...

❖ వచ్చేనెల 1న 'స్వచ్ఛ విద్యాలయం'పై మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల హెచ్ఎంలతో అవగాహనా సదస్సుల ఏర్పాటు ❖ 4న పాఠశాల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ ఛైర్మన్, సభ్యులు, ఏఎన్ఎం, ఏడబ్ల్యూడబ్ల్యూ, మహిళా సభ్యులతో అవగాహన సదస్సు, ర్యాలీ ❖ 5న వన మహోత్సవంలో మొక్కలు నాటడం, వాటి వల్ల ఉపయోగాలు వివరించడం, నాటిన మొక్కల దత్తత ఇవ్వడం. ❖ 6న పాఠశాలలో ఉపయోగపడని పాత రిజిస్టర్లు, ఫర్నిచరు మొదలైన వాటిని తొలగించడం. ❖ 7న పాఠశాలలో, తరగతి గదులను శుభ్రపరచి అలంకరించుకోవడం, రికార్డులు, పిల్లల పుస్తకాలకు అట్టలు వేసుకునే కార్యక్రమం చేపట్టడం. ❖ 8న పాఠశాల స్థాయిలో పిల్లలకు 'స్వచ్ఛ విద్యాలయం'పై వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. ❖ 11న కాంప్లెక్స్, స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం, ఆటలపోటీలు నిర్వహించడం, బహుమతుల ప్రదానం. ❖ 12న విద్యాలయ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లను వాడుకలోకి తెచ్చుకోవడం, దాతల సహాయంతో నీటి సదుపాయం ఏర్పాటు చేసుకోవడం, చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించడం. ❖ 13న మండలస్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం, ఆటలపోటీలు నిర్వహించడం, బహుమతులు అందజేయడం. ❖ 14న విద్యాలయంలో స్వచ్ఛత కోసం జరిగిన కార్యక్రమాలు ఫొటోల ప్రదర్శన, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం. ❖ 15న మండలస్థాయిలో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వం, ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తారు.



గ్రామీణ వైద్యం.. ఆరోగ్య సోపానం!



ఉచితంగా పరీక్షలు, మందులు

గ్రామాల్లోకే వైద్య సేవలు

ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంతో ప్రభుత్వ వైద్య సేవలు గ్రామాలకు విస్తరించాయి. రకరకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నచిన్న చికిత్సకు దూరాన ఉన్న ఆసుపత్రులకు వెళ్లనవసరం లేకుండా ఇంటి ముంగిటే వైద్య సేవలు లభిస్తున్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని వృద్ధులకు పలు సేవలు సాంత్వన చేకూరుస్తున్నాయి. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాల రోగాలకు సైతం ఉచిత పరీక్షలు చేసి మందులు అందజేస్తుండటం ప్రయోజనకరంగా ఉంది. వ్యాధి తీవ్రతనుబట్టి రకరకాల ఆసుపత్రుల సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించుకుంటే మేలు.

న్యూస్‌టుడే – గూడూరు గ్రామీణం

జిల్లాలోని పలురకాల ఆసుపత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆసుపత్రుల నుంచి అందించే సేవలను ప్రజలు చైతన్యవంతులై వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందుతాయన్న భరోసా ఇచ్చేలా వైద్యులు కృషిచేస్తే. ప్రభుత్వ ఆసుపత్రుల లక్ష్యం నెరవేరుతుంది. పట్టణం నుంచి గ్రామస్థాయి వరకూ ప్రజలకు అందుతున్న వైద్య సేవలివీ...

ఆపదలో ఆసరా

ఏదైనా ప్రమాదం జరిగితే మొదటిగా గుర్తుకొచ్చేది 108. ప్రమాదం జరిగినా, ఎవరైనా అనారోగ్యానికి గురైనా ఆసమయంలో ఉన్న స్థానికులైనా, పోలీసులైనా 108కి ఫోన్‌చేసి చెబుతారు. గతంలో ప్రమాదం జరిగితే క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చడానికి నానాఅవస్థలు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ వాహనాలను మరింత ఆధునికీకరించి, మరిన్ని వసతులతో అందుబాటులోకి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితిలో ఎంతో మంది గర్భిణులు ఈ వాహనాల్లోనే ప్రసవించిన సంఘటనలు వీటి ఆవశ్యతను తెలియజేస్తున్నాయి. ఓ చిన్నారిని ఈ లోకంలోకి తీసుకురావడంలో, మృత్యువు కోరల్లో చిక్కుకున్న వారికి ప్రాణాలు పోయడంలో ఈ వాహనాల పాత్ర కీలకమైనది. జిల్లా వ్యాప్తంగా 35 వాహనాలు సేవలు అందిస్తున్నాయి.



జిల్లాఆసుపత్రిలో ఉన్న సీటీ స్కాన్ పరికరం

ఆరోగ్య సలహాలకు 102...

ఒక్కోసారి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయిన సమయంలో రోగితోపాటు కుటుంబ సభ్యులు కూడా ఆందోళనకు గురవుతుంటారు. ఆ సమయంలో వైద్యులను సంప్రదించి సలహాలు పొందేందుకు ప్రవేశపెట్టిన కార్యక్రమమే 102 సేవలు. 102 ఉచిత టెలీ-సర్వీస్‌కు కాల్ చేసి ఉచితంగా ఆరోగ్య సలహాలు, సూచనలు పొందడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పరిష్కరించుకోవచ్చు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇలా ఎవరైనా ఉచితంగా వైద్యుని సలహాలు తీసుకోవచ్చు.

మహిళా మాస్టర్ హెల్త్ చెకప్...

సాధారణంగా 30 ఏళ్లు దాటిన మహిళలకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి. గర్భసంచి సంబంధిత సమస్యలతో పాటు పలు అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి వారికి 'మహిళా మాస్టర్ హెల్త్ చెకప్' కార్యక్రమం పేరిట గర్భసంచితోపాటు రొమ్ము, నోటి తదితర క్యాన్సర్‌లకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఈ సేవలను అందుబాటులో ఉంచినా తక్కువ మంది మాత్రమే వినియోగించుకుంటున్నారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పిస్తే ఎక్కువ మంది వినియోగించుకొనే అవకాశం ఉంది.

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	: 80
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	: 12
ప్రాంతీయ ఆసుపత్రులు	: 2
ఉపకేంద్రాలు	: 620
24 గంటల పీహెచ్‌సీలు	: 27

ఎన్టీఆర్ వైద్యసేవ

అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ వైద్యసేవ పేరిట లక్షల ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడంతోపాటు శస్త్రచికిత్సలు అవసరమైన వారికి పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు

పేదలకు మెరుగైన సేవలు నిరంతరం అందించేందుకు పట్టణాల్లో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 29 కేంద్రాల నుంచి రోజుకు సగటున 1500 నుంచి 2000 మంది సామాన్యులు, పేదలు వైద్యం పొందుతున్నారు. ఇక్కడ ఆధార్ కార్డు తీసుకువెళ్లి వివరాలు తెలిపి ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారు. ఈ కేంద్రాల్లో ఎంబీబీఎస్ వైద్యుడు, కార్డియాలజీ, ఎండోక్రినాలజీ, ఆర్థోపెడిక్ సమస్యలకు నిపుణులైన వైద్యులతో టెలీమెడిసిన్ అందిస్తారు. ప్రతిరోజు వివిధరకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ సౌకర్యం, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయి.

ఎన్టీఆర్ వైద్య పరీక్షలు...

ప్రజలు అనారోగ్యానికి గురైతే వ్యాధి నిర్ధరణ కావాలంటే మొదట పరీక్షలు నిర్వహించాలి. ఇందుకు రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్ణీత సమయంలో నాణ్యమైన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఆసుపత్రిలో పలురకాల అత్యాధునిక పరికరాలతో కూడిన పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు పీహెచ్‌సీల్లో 19, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 40, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో 63 రకాల పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారు. వీటిపట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న మంత్రి రవీంద్ర (పాత చిత్రం)

ముఖ్యమంత్రి సహాయనిధి...

ఎన్టీఆర్ వైద్యసేవలో అందని ఖరీదైన చికిత్సలు కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కోట్లాది రూపాయలు సాయం అందిస్తున్నారు. అనేక మంది పేదలకు ఈ నిధి అండగా నిలుస్తోంది. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో మంత్రి రవీంద్ర చొరవతో వివిధ ప్రాంతాలకు చెందిన 133 మంది రోగులకు రూ. 1.11 కోట్లు సాయంగా అందించారు. జిల్లాలో వేలాదిమంది ఈ సాయాన్ని అందుకున్నారు. ఇలా అనేక సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు వినియోగించుకుంటే మేలు.



తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్...



మాతా శిశు సంరక్షణ కోసం తీసుకున్న చర్యల్లో భాగంగా తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన బాలింతలను ఆసుపత్రి నుంచి ఇంటికి సురక్షితంగా చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. గతంలో ప్రసవమైన తరువాత బాలింతలను జాగ్రత్తగా ఇంటికి చేర్చడానికి కార్లు, ఇతర వాహనాలకు డబ్బులు చెల్లించలేక పేదలు అవస్థలు పడేవారు. ప్రస్తుతం ఈ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి కూర్చుంటే చాలు సురక్షితంగా ఇంటికి చేరుస్తుంది. జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 18 వేల మందికిపైగా ప్రసవానంతరం తల్లీబిడ్డలను వారి ఇళ్లకు సురక్షితంగా చేర్చారు. దీంతోపాటు శిశువుల కోసం వారికి కావాల్సిన 15 వస్తువులతో కూడిన బేబీకిట్‌లను కూడా అందిస్తున్నారు. ఇప్పటికి 2 వేలకుపైగా కిట్లు అందజేశారు.

చంద్రన్న సంచార చికిత్స..



ఆసుపత్రి సౌకర్యం అందుబాటులో లేక ఇబ్బందులు పడేవారికి 104 వాహనం సేవలు ఎంతో ఉపయోకరంగా ఉన్నాయి. తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకునే వారి వద్దకే వెళ్లి చికిత్స అందించేందుకు ప్రభుత్వం చంద్రన్న సంచార చికిత్స పేరిట 104 వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ వాహనంలో ఒక వైద్యునితో పాటు ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం ఉంటారు. గ్రామాలకు వెళ్లి గర్భిణులతోపాటు రక్తపోటు, మధుమేహం తదితర రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 20 వాహనాల ద్వారా 978 గ్రామాలను సందర్శించి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

సమగ్ర మూల్యాంకనం.. అడ్డంకులు నిరంతరం

- నెట్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- జిల్లాలోని విద్యార్థులపై ఆర్థికభారం
- ఇప్పటికే 17 రాష్ట్రాల్లో నిలిపివేత

న్యూస్‌టుడే, ముదినేపల్లి

విద్యార్థులను అన్ని సామర్థ్యాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని ప్రవేశపెట్టిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) ఆచరణలో మాత్రం వైఫల్యాలనే ఎదుర్కొంటోంది. ఇప్పటికే చాలా రాష్ట్రాలు దీన్ని అమలుచేయలేమని చేతులెత్తేశాయి. మన రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతానికి కొనసాగిస్తోంది. తెలంగాణలో సీసీఈ విధానం నిలిపివేతపై కమిటీని ఏర్పాటుచేశారు. ఈ విధానం విద్యార్థులకు ఆర్థికంగా, ఉపాధ్యాయులకు బోధన భారంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్యం మంచిదే..

ఇతర దేశాలతో పోలిస్తే మన విద్య నాణ్యత స్వల్పంగా ఉందని తేటతెల్లమవుతోంది. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తయినా విద్యార్థి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందిపుచ్చుకోవటంలో విఫలం అవుతున్నారనే ఉద్దేశంతో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ప్రవేశపెట్టారు. ముందుగా 2009లో ప్రాథమిక స్థాయిలో సీసీఈ విధానాన్ని అమలుచేశారు. తర్వాత 8, 9, 10వ తరగతులకు కూడా అమలుచేస్తున్నారు. గత విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షలు కూడా ఈ విధానంలోనే జరిగాయి. విద్యార్థి సమగ్రంగా అభివృద్ధి చెందటానికి వివిధ సామర్థ్యాలను ప్రవేశపెట్టారు. దీంతో సామర్థ్యాల పెంపునకు సొంతంగా ఆలోచించడం, సృజనాత్మకత, ఇతర సహపాఠ్యపుస్తకాలు పెంపొందించుకునే అవకాశం ఉంది.

పాఠ్యాంశాలు సరే.. వసతులేవీ?

సీసీఈ విధానానికి అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించారు. అంతవరకు బాగానే ఉన్నా ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలు కలిపి కనిష్ఠంగా 28 ప్రాజెక్టు పనులు, 28 ప్రయోగాలు, పుస్తక సమీక్షలు, 28 సూక్ష్మ పరీక్షలతో పాటు ప్రతి పాఠ్యాంశానికి సంబంధించి ప్రశ్నలు రాయాలి. కనీస వసతులు లేని అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించటం సాధ్యమవుతుందా.? గ్రంథాలు లేని పాఠశాలలు కోకొల్లలున్నపుడు పుస్తక సమీక్ష ఎలా సాధ్యం? దీంతో వీటికి కేటాయించే మార్కులు ఏదో మొక్కుబడి కేటాయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అంతర్జాల కేంద్రాల వద్ద పడిగాపులు...

విద్యార్థులు ప్రాజెక్టులకు సంబంధించిన సామగ్రి కోసం పాఠశాల ముగిసిన తర్వాత అంతర్జాల కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. బాలికలు మరీ ఇబ్బంది పడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. సీసీఈ కార్యక్రమం రూపొందించి ఎనిమిదేళ్లవుతున్నా ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో ఇంతవరకు అవగాహన కల్పించలేదని ఆరోపిస్తున్నారు. ఏడాదికి నాలుగు ఎఫ్ఏలు, మూడు ఎస్ఏ పరీక్షలు పెట్టాలి. 8, 9వ తరగతి బోధించే ఉపాధ్యాయులయితే 20 శాతం మార్కులు బాహ్యమూల్యాంకనానికి ప్రత్యేకంగా కేటాయించాలి. ఈ విధానంలో విజయాలు కంటే వైఫల్యాలే ఎక్కువని నిపుణులు తెలుపుతున్నారు

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 5,62,610 మంది ఉన్నారు. ఇందులో దాదాపు 3.50 లక్షల మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్నారు. ఒక్కో ప్రాజెక్టుకోసం ఒక్కో విద్యార్థి అంతర్జాలం ఖర్చుకు, ముద్రణకు, జిగురుకు దాదాపు రూ. 20 నుంచి రూ. 30 వరకు వెచ్చించాలి. ఒక్కో విద్యార్థి దాదాపు 28 ప్రాజెక్టులు చేయాలంటే రూ. 700 నుంచి రూ. 900 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా మొత్తం విద్యార్థులపై దాదాపు రూ. 3 కోట్లకు పైగా భారం పడుతుంది.



అంతర్జాల సెంటరులో విద్యార్థులు

పునఃసమీక్షించాలి

సీసీఈ విధానాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించాలి. ఈ విధానం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పెనుభారంగా ఉంది. ఈ విధానంలో వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సీబీఎస్ఈ కూడా ఈ విద్యాసంవత్సరం నుంచి సీసీఈ విధానాన్ని నిలిపి వేసింది. ప్రభుత్వం కూడా దీన్ని నిలిపివేయాలి.
– బేతాళ రాజేంద్రప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకుడు



అంతర్జాలం కోసం తంటాలు

పాఠశాలల్లో వసతులు కల్పించకుండా ప్రాజెక్టు పనులు, సహపాఠ్య కార్యక్రమాలు ఎలా అభివృద్ధి చేయగలం? విద్యార్థులు అంతర్జాల కేంద్రం చుట్టూ తిరగటం సమంజసం కాదు. గ్రామీణ ప్రాంతంలో అంతర్జాల సౌకర్యం కష్టం. అందుకే విద్యార్థుల ఇబ్బందిని చూసి ఉపాధ్యాయులంతా అంతర్జాలం ఉన్న ఫోన్‌ను సొంత ఖర్చులతో సమకూర్చుకొని.. వారు ప్రాజెక్టులు చూడటానికి వినియోగిస్తున్నాం. **– ఆగల్లు హరికృష్ణ, ఉపాధ్యాయుడు, కొర్ర గుంటపాలెం**





ఎవరైనా మీద చేయి వేసినప్పుడు ఎలా తప్పించుకోవాలో శిక్షణ..

చెయ్యేస్తే.. చెడుగుడే..

- ❏ మగువలకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ
- ❏ విజయవాడ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ

పటమట, న్యూస్‌టుడే

ప్రస్తుతం మహిళలు రోడ్డు మీద ఒంటరిగా నడిచి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. ఎటు నుంచి ఎవరు వచ్చి ఏం చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. గొలుసు దొంగతనాల జోరుతో పక్కన నుంచి ద్విచక్రవాహనం వెళ్తుంటే వెన్నులో వెణుకుపుడుతోంది. గొలుసు దొంగతనాలు ఒక్కటే కాదు.. ప్రేమించమని వెంట పడి వేధించడం.. దాడి చేసేందుకు ప్రయత్నించడం.. దోపిడీకి పాల్పడటం.. అసభ్యంగా ప్రవర్తించడం.. ఇలా అనేక సమస్యలను మహిళలను ఎదుర్కొంటున్నారు. వాటి నుంచి రక్షణ పొందాలంటే మహిళలకు ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన అవసరం. ఈ నేపథ్యంలో రాజధాని నగరం విజయవాడను నేర రహితంగా తీర్చిదిద్దేందుకు.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను రూపుమాపేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

విజయవాడ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీసులకు ఆత్మరక్షణ పద్ధతుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. పోలీసుశాఖ, వాసవ్య మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ, ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఆడపిల్లలకు ఆత్మరక్షణలో టెక్నిక్స్‌ను నేర్పిస్తున్నారు. నగరంలో మహిళల సమస్యల పరిష్కారం, మహిళల హక్కుల పరిరక్షణ, సమానత్వం పోలీస్ శాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా మిత్రను ఏర్పాటు చేశారు. నగరంలో ఈవ్‌టీజింగ్‌ను రూపుమాపేందుకు ఈవ్‌టీజర్లను పట్టుకొచ్చి, వాసవ్య మహిళా మండలిలో కౌన్సెలర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. మహిళలు ఎటువంటి పరిస్థితి ఎదురైనా తమను, తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ పద్ధతులను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని వాసవ్య మహిళా మండలి, పోలీసులు గుర్తించారు. మండలి అధ్యక్షురాలు చెన్నుపాటి విద్య, పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ, డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో యాక్సిస్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు వి.రామకృష్ణ సహకారంతో తొలుత మహిళా మిత్ర సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, వారి ద్వారా సమాజంలోని విద్యార్థినులు, మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. రుద్రమ్మ దేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీకి చెందిన అంతర్జాతీయ బంగారు పతక విజేత బ్లాక్ బెల్ట్ ఆరో డాన్ (కాయ్) మాస్టర్ లక్ష్మీ, నేషనల్ చీఫ్ కోచ్, బ్లాక్ బెల్ట్ ఏడో డాన్ (కాయ్) మాస్టర్ రవి మహిళా కానిస్టేబుళ్లకు మెలకువలు నేర్పిస్తున్నారు. బెంజి సర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సుమారు 250 నుంచి 300 మందికి శిక్షణ ఇచ్చారు. బలంతో సంబంధం లేదని, ఆత్మవిశ్వాసం, ధైర్యం ఉంటే ఎంతటి బలవంతుడినైనా మట్టికరిపించవచ్చని చెబుతున్నారు.

ఎంతో ఉపయోగకరం

- ఎస్.రమ్య, మహిళా కానిస్టేబుల్, సత్యనారాయణపురం

ఆత్మరక్షణ మెలకువలు మహిళలకు చాలా ఉపయోగకరం. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. సమాజంలో ప్రస్తుతం మహిళలు తమకు ఆపద ఎదురైనప్పుడు ఎలా రక్షించుకోవాలో వాటిని చక్కగా నేర్పించారు. ఈ అంశాలన్నింటిని నేర్చుకోవడంతో పాటు తమ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మహిళలకు, పాఠశాలల్లో తర్ఫీదు ఇస్తాం.

15 లక్షల మందికి మెలకువలు నేర్పా: ఎన్.లక్ష్మి, శిక్షకురాలు

మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్‌లో జాతీయ స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించినప్పుడు లభించిన ఆనందం కన్నా, లక్షలాది మంది మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మాస్టర్ రవి సహకారంతో ఇప్పటి వరకు 15 లక్షల మందికి ఆడపిల్లల, మహిళలకు శిక్షణ ఇచ్చాం. ర్యాగింగ్ చేసినా, ఆకతాయిలు వేధించినా, దాడులు చేసినా వారి నుంచి ఎలా రక్షణ పొందాలో మెలకువలు నేర్పిస్తున్నాం. దీనిపై మలేషియాలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాం. వాసవ్య మహిళా మండలి కంకణం కట్టుకొని, పోలీసు శాఖ వారి సహకారంతో మహిళా మిత్ర సభ్యులకు ఇటువంటి శిక్షణ ఇవ్వడం హర్షణీయం.

పోలీస్ అకాడమీలోనూ శిక్షణ

ఆత్మరక్షణ పద్ధతులపై పోలీస్ అకాడమీలో పదిహేనేళ్లుగా శిక్షణ ఇస్తున్నాం. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు నేర్పించాం. హైదరాబాద్‌లో షీ టీమ్ సభ్యులకు, ఐటీ కంపెనీలు, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. నాగార్జున విశ్వవిద్యాలయంలో 1600 మంది హాస్టల్ పిల్లలకు శిక్షణ ఇచ్చాం. తొలిసారిగా విజయవాడలో మహిళా మిత్ర సభ్యులకు శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థినులకు శిక్షణ ఇవ్వాలనుకుంటున్నాం. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సహకారం ఉంటే వీలైనంత ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వవచ్చు. **- చందు శ్రీనివాస్, ఛైర్మన్, రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ**

ప్రతిభ



TENTH English

PREPOSITIONS

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company he keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)

2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.

2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.

2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of

2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from

3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with

4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in

Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without

Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘనపరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్ ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఒడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఒడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.


ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపుష్టం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికైన, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని ఆయుదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిష్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

అట్టహాసంగా ముగిసిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు

బాలికల విభాగంలో విజేతగా నిలిచిన కడప జిల్లా జట్టు ● బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు జయకేతనం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక పీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 18న ప్రారంభమైన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. బాలుర విభాగంలో కృష్ణా జట్టు విజేతగా నిలవగా, బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. సెమీ ఫైనల్ నుంచి మ్యాచ్‌లన్నీ హోరాహోరీగా సాగాయి. ముగింపు కార్యక్రమానికి కడప జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పరిశీలకుడు ఎంఎస్ ఉమాశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బేస్‌బాల్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. జమ్మలమడుగులో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించినందుకు కడప జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కోచ్‌లను సన్మానించారు. కార్యక్రమం చివరలో బేస్‌బాల్ జాతీయస్థాయిలో ఆడే జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శి ఎం.వి.సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు సజ్జనరావు, కోశాధికారి ఎస్.సాంబశివరావు, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా సంఘం కార్యదర్శి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉమాశంకర్



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా జిల్లా బాలుర జట్టు

సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ విజేతలు: బాలుర విభాగం: **మొదటి స్థానం:** కృష్ణా జిల్లా **రెండో స్థానం:** కడప జిల్లా **మూడో స్థానం:** ప్రకాశం జిల్లా **నాలుగో స్థానం:** శ్రీకాకుళం జిల్లా బాలికల విభాగం: **మొదటి స్థానం:** కడప జిల్లా **రెండో స్థానం:** కృష్ణా జిల్లా **మూడో స్థానం:** గుంటూరు జిల్లా **నాలుగో స్థానం:** అనంతపురం జిల్లా

నేటి నుంచి కోస్తా క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్, ఎగ్జిబిషన్

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 21, 22 తేదీల్లో కోస్తా జిల్లాల క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలతో పాటు, ఆరు సబ్జెక్టులలో ప్రదర్శన జరుగుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ జి.మల్లికార్జునబాబు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోని 9 విద్యాలయాలు నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారు ఈ నెల 26 నుంచి 28 వరకు నెల్లూరులో జరిగే హైదరాబాదు రీజియన్ పరిధిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన వారు పాల్గొంటారన్నారు. ఆరు సబ్జెక్టులలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి గుంటూరులో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే హైదరాబాదు రీజియన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

మంగళపాలెం(కొత్తవలస), న్యూస్‌టుడే: మంగళపాలెంలో శ్రీగురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని మచిలీపట్నం వినియోగదారుల ఫోరమ్ ప్రెసిడెంట్ పి.మోహనరావు ఆదివారం సందర్శించారు. కృత్రిమ అవయవాలు తయారు చేస్తున్న విధానం తెలుసుకున్నారు. 13 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా ట్రస్ట్ చేస్తున్న సేవలను ఛైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మోహనరావు మాట్లాడారు. మానవ సేవే మాధవ సేవగా ఎంచుకుని జగదీష్‌కుమార్ దివ్యాంగులకు, వృద్ధులకు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, అంధులకు పింఛన్లు, 50 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడుతున్న మోహనరావు

గోదావరిలో యువకుడి గల్లంతు

కొవ్వూరు నేరవిభాగం, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో గోష్పాదక్షేత్రంలో గోదావరి స్నానానికి దిగిన యువకుడు గల్లంతయ్యాడు. బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం విజ్ఞాన పురం గ్రామానికి చెందిన కనపర్తి సురేంద్ర(20) సుమారు 25మంది గ్రామస్థులతో తీర్థ యాత్రల నిమిత్తం బయలు దేరారు. శనివారం రాత్రి గౌరీపట్నంలో మేరిమాత దర్శనం అనంతరం ఆదివారం తాళ్లపూడి మండలం వేగేశ్వర పురానికి చెందిన మేరీమాత ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఇంటికి వెళ్తూ గోష్పాదక్షేత్రంలోని గోదావరి నదిలో స్నానానికి దిగారు. సురేంద్రతో పాటు పసల రోమన్ తదితరులు సమీపంలో స్నానం చేస్తున్నారు. గోదావరి వడి అధికంగా ఉండడంతో సురేంద్ర ఈత వచ్చినా ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన రోమన్, సురేంద్రను రక్షించే ప్రయత్నం చేశాడు. ఇంతలో అక్కడే స్నానం చేస్తున్న మాదాను అనసూర్య తన చీరను అందించింది. చీర సహాయంతో రోమన్ బయటపడగా సురేంద్ర జారిపోయాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్.జాన సతీష్‌లు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 6.30 నిమిషాల వరకూ గాలించినా సురేంద్ర లభ్యం కాలేదు. అగ్నిమాపకాధికారి కౌరు సత్యానందం ఆదేశాల మేరకు జీఎన్.సుబ్రహ్మణ్యం, కె.వెంకటేశ్వరరావు, కె.గంగరాజు, సుధాకర్‌లు గాలించిన వారిలో ఉన్నారు. సురేంద్ర తన తండ్రి నాగేశ్వరరావుతో పాటు రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వివాహ వయస్సుకు వచ్చిన సురేంద్ర గల్లంతు గ్రామస్థులను శోక సంద్రంలో ముంచింది.

సమస్య పరిష్కారానికి ఉద్యమించాలి

పటమట, న్యూస్‌టుడే: ఉద్యమాల ద్వారానే తమ హక్కులను, డిమాండ్లను సాధించుకోగలమని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) రాష్ట్ర నాయకులు పి.అజయ్‌కుమార్ అన్నారు. సంఘం కృష్ణా జిల్లా సర్వసభ్య సమావేశం ఆటోనగర్ బస్‌స్టాండ్ సమీపంలోని సాయిబాబా కల్యాణమండపంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అజయకుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల ఐక్యతను దెబ్బతీసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని, ఇతరులు చెప్పే మాటలను నమ్మవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భిన్నమైన పోకడలను అవలంభిస్తూ ఏపీఆర్‌పీఏ చేస్తున్న ఉద్యమాన్ని, పెన్షనర్ల ఐక్యతను భంగపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. సీబీటీ సమావేశాల్లో కమ్యుటేషన్, ఆర్ఓసీ సౌకర్యాల పునరుద్ధరణ, కమ్యూటేషన్ కాలం 15ఏళ్లు పూర్తయిన వారందరికీ తిరిగి పూర్తి పెన్షన్ పునరుద్ధరణకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు కేంద్ర కమిటీ తెలిపిందన్నారు. కానీ అమలుకు ఆదేశాలు ఇవ్వడం లేదని, భవిష్యత్తు ఉద్యమాల ద్వారానే వీటిని సాధించుకోగలమన్నారు. ఏపీఆర్‌పీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రభుదాసు, ఎన్.ఎ.శాస్త్రి మాట్లాడుతూ ఈ నెల 30న ఈపీఎఫ్ కార్యాలయాల వద్ద ధర్నాలను నిర్వహించి వినతిపత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబరులో విశాఖపట్నంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

22న జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడ పాయకాపురంలోని సెయింట్ జోసెఫ్స్ స్కూల్‌లో జిల్లా సబ్ జూనియర్ (అండర్-15) బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపిక చేస్తామని ఆ సంఘం కార్యదర్శి కాకర్ల శ్రీనివాసరావు తెలిపారు. జనవరి 1, 2002 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు, మూడు పాస్ పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటలకు హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల ఒకటి నుంచి మూడు రోజుల పాటు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

యాంత్రీకరణ తోనే గిట్టుబాటు సాగు

పనులకు వినియోగించే పశుసంపద తరిగిపోవడం, కూలీల కొరత ఏర్పడటంతో వ్యవసాయం పెనుభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని యంత్రాలతో చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలు రైతుల శ్రమను, సాగు ఖర్చును 30 నుంచి 60 శాతం వరకు తగ్గించే అవకాశాలున్నాయి. కనుక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే యాంత్రీకరణ అవసరమని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య అన్నారు.

యంత్ర పరికరాలు: నేల దున్నటానికి కల్టివేటరు, రోటోవేటరు, విత్తనం వేయడానికి సీడ్‌డ్రిల్లర్, ప్లాంటర్, అంతరకృషి కోసం పవర్‌వీడర్, సస్యరక్షణ కోసం చిన్న స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్, పంట కోత యంత్రాలు, మల్టీ క్రాప్ క్రషర్, వరికోత యంత్రం తదితర అధునాతన యంత్రాలతో పాటు నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, జల ఫిరంగులు, బిందుసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలన్నింటిని ట్రాక్టర్లకు అనుసంధానం చేసుకుని ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ పథకం కింద పెద్ద ఎత్తున రాయితీపై యాంత్రీకరణ ఉపకరణాలను అందచేస్తున్నది. వ్యవసాయాధికారులను సంప్రదించి రాయితీ ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. రాయితీపై జల ఫిరంగులు, స్ప్రింక్లర్లు, బిందుసేద్యం పరికరాలను ఆయా మండలాల్లోని సూక్ష్మ నీటిపారుదల పథకం ఏరియా అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తారు. సాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంబిస్తే వ్యవసాయ రంగం లాభాల బాట పట్టే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరం.



యంత్రంతో వరి నాటుతున్న రైతు

–న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

సజ్జ పంటలో సస్యరక్షణ

జొన్న తర్వాత రైతులు అధికంగా పండించే పంట సజ్జ. ఇందులో మంచి పోషకాలు ఉంటాయి. ప్రస్తుతం పంటల సాగు మొదలై నెలన్నరకు పైగా అవుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు.

పచ్చకంకి లేదా వెర్రికంకి తెగులు: తెగులు సోకిన మొక్క కాండంపై పూర్తిగా లేదా అసంపూర్తిగా ఆకులుగా మారిన పుష్పగుచ్ఛం ఏర్పడుతుంది. తెగులు లక్షణాలు మొదట లేత మొక్కలపై, 3-4 ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కలు పసుపురంగు లోకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటే ఆకుల అడుగుభాగంలో తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తెగులు తీవ్రదశలో మొక్కలు గిడసబారి 30 రోజులు లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులుగా మారిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. ఆప్రాన్ ఎస్.డి 35 మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను ఏరి కాల్చివేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు 5 శాతం మించి ఉంటే రిడోమిల్ (25డబ్ల్యూపీ) లీటరు నీటికి 1 గ్రా. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

తేనెబంక తెగులు: తెగులు సోకిన కంకి నుంచి గులాబి లేదా ఎర్రరంగుగా ఉన్న తేనె వంటి చిక్కటి ద్రవం బొట్లు బొట్లుగా కారుతుంది. ఈ ద్రవంతో శిలీంధ్ర బీజాలు ఏర్పడతాయి. మొక్కలు పుష్పించే దశలో మబ్బుతో కూడిన ఆకాశం, వర్షపు తుంపరలు, వాతావరణం చల్లగా ఉండటంతో ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేస్తుంది. దీని నివారణకు విత్తనాలను లీటరు నీటికి 20 గ్రా. ఉప్పు కలిపిన నీటి ద్రావణంలో శుద్ధి చేసి, ఆరనిచ్చి కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. పైరు పూతదశలో మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి.

✦ తేలిక నేలల్లో చెదల నివారణకు ఎకరాకు 8 కిలోల 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. లేత మొక్క దశలో మిడతల నుంచి పంటను కాపాడటానికి 5 శాతం కార్బరిల్ పొడి లేదా 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని ఎకరాకు 8-10 కిలోలు చొప్పున చల్లాలి.



వెర్రికంకి తెగులు సోకిన మొక్క

–న్యూస్‌టుడే, హాలహర్వి.

పిల్లల సామర్థ్యాలపై సర్వే

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ



న్యూస్‌టుడే - పెడన గ్రామీణం

వివేకవంతమైన సమాజ నిర్మాణం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. దీనికోసం నైపుణ్యవంతమైన మానవశక్తి నిర్మాణానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లాలో లక్షలాది మంది ప్రాథమికస్థాయి విద్యార్థుల సామర్థ్య తీరుతెన్నులపై పునఃసమీక్షకు రంగం సిద్ధమవుతోంది. విద్యార్థుల సామర్థ్యంపై సర్వే నిర్వహించి వివరాలు సేకరిస్తారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేసి, మెరుగైన విధంగా సామర్థ్యాలు పెంచుకునే విధంగా చర్యలు చేపడతారు. ఇందులో భాగంగా జాతీయ సర్వే ఏజెన్సీలు, రాష్ట్ర, జిల్లా స్థాయి మదింపు ఫలితాల ఆధారంగా కార్యచరణ రూపొందించనున్నారు. తిరిగి ఎటువంటి బోధన పద్ధతులు అవలంభించాలో విధివిధానాలు రూపొందించనున్నారు.

దేశవ్యాప్త సర్వే...

దేశవ్యాప్తంగా 2013 నుంచి జాతీయ సముపార్జన పరీక్ష సర్వే (ఎన్‌ఏఎస్) నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సర్వే నిర్వహించి పిల్లల్లో సామర్థ్యాలను అంచనా వేయనున్నారు. కేంద్ర మావన వనరుల శాఖ ఆదేశాల మేరకు ఈ సర్వే జరుగనుంది. పిల్లలకు రకరకాల పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాలను కొలవనున్నారు. గతంలో ఆసర్ సర్వే సందర్భంలో.. పాఠ్య పుస్తకంలోని ప్రశ్నల్ని చదవడం, ఆంగ్ల భాష నిర్మాణం గురించి బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇచ్చి విద్యార్థుల సామర్థ్యాల్ని కొలిచారు.

52 పాఠశాలల చొప్పున ఎంపిక...

జిల్లాలో ఎంపిక చేసిన 52 పాఠశాలల్లో మూడో తరగతి విద్యార్థులకు, 52 పాఠశాలల్లో అయిదో తరగతి, 52 పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి అంచనా వేయనున్నారు.

పరీక్షలకు సిద్ధం చేసేందుకు...

ఈ ఏడాది జాతీయ మానవ వనరుల విభాగం జాతీయ సముపార్జన సర్వేకు సిద్ధమవుతోంది. 3, 5, 8 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేయనుంది. ఈ మదింపు ఎలా ఉండాలన్న అంశంపై ఈ నెల 21 నుంచి 23 వరకు ఉపాధ్యాయులకు దూర దృశ్య శ్రవణ శిక్షణ ఏర్పాటు చేసింది. విద్యార్థులను ఏ నమూనాలో పరీక్షించాలి, ఈ పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేయాలనే అంశాలపై వివరించనున్నారు. వీరంతా సామర్థ్య పరీక్షలకు సిద్ధమయ్యేలా పిల్లలకు మార్గదర్శనం చేయనున్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారు. 23న 8వ తరగతి బోధించే పాఠశాల సహాయక ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు.

సమాచారం అందించాం

ఇప్పటికే అన్నిస్థాయిల విద్యా శాఖాధికారులకు దూర దృశ్య శ్రవణ శిక్షణపై సమాచారం అందజేశాం. ఉపాధ్యాయులు 50 శాతం మంది ఒక రోజు, మరో 50 శాతం మంది మరో రోజు సమీపంలోని ఆర్వోటీ కేంద్రానికి హాజరై శిక్షణలో పాల్గొనాలి.

- సలార్, జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏఎంవో

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఉద్యోగార్హులు 15 శాతమే

ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్



మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థుల్లో పారిశ్రామిక నైపుణ్యాలు, ఉద్యోగార్హతలు ఉన్నవారు కేవలం 15 శాతం మాత్రమేనని ఏపీపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ పి.ఉదయభాస్కర్ పేర్కొన్నారు. స్థానిక జీఈసీలో ఆదివారం నిర్వహించిన 16వ గ్రాడ్యుయేషన్‌డే సభా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగార్హతకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమలకు అత్యవసరమైన అర్హతలు ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొరవడుతున్నాయన్నారు. నేటి తరం విద్యార్థులు విద్యతో పాటు కొత్తగా వస్తున్న సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాధన, సృజనాత్మకత విద్యార్థి ప్రగతికి మూలమన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, యూరోపియన్ దేశాలల్లో ప్రగతికి, అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాలు ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉండడానికి తేడా కేవలం సమయపాలనే కారణమన్నారు. అనంతరం పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ నాగేశ్వరరావు, సత్యనారాయణ, రామకృష్ణ, సుబ్బారావు, కేవీ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న ఉదయభాస్కర్

'విశ్వకాంతి సందేశం'పై అవగాహన అవసరం

ముత్యాలంపాడు(సత్యానారాయణపురం), న్యూస్‌టుడే: మనసులో ఉన్న అతీంద్రయ శక్తులను తెలుసుకోవడమే విశ్వకాంతి సందేశమని, ఇది ధ్యానం ద్వారానే సాధ్యమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ కేవీ రావు(విశాఖ) పేర్కొన్నారు. ఆదివారం ముత్యాలంపాడులోని ది ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్, బాలభవన్‌లో విశ్వకాంతి సందేశం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సృష్టిలో ఎన్నో జీవరాశులు సూర్య కాంతి కోసం ఎదురు చూస్తుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ విశ్వకాంతిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు జక్కా రాఘవరావు మాట్లాడుతూ ధ్యానం విశ్వమయం కావాలని అందుకు ప్రతి పిరమిడ్ మాస్టర్ చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో సీనియర్ పిరమిడ్ మాస్టర్ కళ్లం రామిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల తాను అమెరికాలో ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించానని, స్థానికుల నుంచి చక్కని స్పందన లభించిందన్నారు. నిర్వాహకులు పి.వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ త్రిమూర్తిరాజు, వి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ అడహాక్ కమిటీ ఏర్పాటు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం అడహాక్ కమిటీ 10 మందితో ఏర్పాటైంది. 2010 నుంచి ఎన్నికలు జరుగనందున వెంటనే ఎన్నికలు జరపాలని నిర్ణయించినట్లు అడహాక్ కమిటీ ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు, తెలిపారు. అక్టోబర్‌లో జిల్లా స్థాయి సంఘాలను ఏర్పాటు చేసుకుని, రాష్ట్ర స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. అడహాక్ కమిటీ ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు, జె.సత్యనారాయణ(విశాఖ), పి.పద్మావతి(ఏలూరు), సీహెచ్. శ్రీరామ్(కృష్ణా), డి.ఎస్.ఆర్.క్రిష్ణ(గుంటూరు), ఇందిర(కర్నూలు), ఎం.శేఖర్(ఒంగోలు) మరో ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్రీడా స్ఫూర్తితో పోటీ పడాలి

జిల్లా ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ ప్రారంభం



మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తితో తలపడాలని డీఎస్పీ సీహెచ్‌లక్ష్మీపతి పేర్కొన్నారు. జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా కాలం తర్వాత జిల్లాలో బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి అర్జా పాండురంగారావు మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేసే ప్రతి సంఘాలనికి తమ ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. పల్లెటూరు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జొన్న రాజేష్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభగల విద్యార్థులను విద్య, క్రీడల్లో ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తామన్నారు. బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మండె కిరణ్‌కుమార్, రాష్ట్ర ఆత్యాపాత్యా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్డీప్రసాద్, జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి డీఎస్పీ సీహెచ్‌లక్ష్మీపతి బౌట్‌ను ప్రారంభించారు.

తాడు తెగింది.. కిందపడింది

కొత్త ట్రాక్టర్ల లోడుతో ఉన్న ట్రాలీ ఒకటి ఆదివారం విజయవాడ వైపు నుంచి ఏలూరు వైపు 16వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తోంది. ఈ వాహనం హనుమాన్‌జంక్షన్ శివారు చేరుకునే సరికి ట్రాక్టర్లన్నింటికి కలిపి కట్టిన తాడు తెగిపోయింది. చివర ఉన్న ట్రాక్టర్ కిందకు పడిపోయింది.

- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్ గ్రామీణం



ముద్దాయిలతో జైలు క్వార్టర్ల మరమ్మతు పనులు



సబ్‌జైలును సందర్శించి సూపరింటెండెంటు దురారావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస బాబు

విచారణ నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసబాబు

గుడివాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ జైలు క్వార్టర్స్‌లో నేల చదును చేసే పనులకు ముద్దాయిలను జైల్ సూపరింటెండెంట్ వినియోగించడం వివాదస్పదమైంది. ఇది తెలిసిన జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసబాబు ఆదివారం సబ్‌జైలును సందర్శించి పనిచేసిన వారు రిమాండ్ ముద్దాయిలా లేక శిక్షపడినవారా అనే విషయమై విచారణ నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. సబ్‌జైలర్ దుర్గారావు నలుగురు ముద్దాయిలతో ఉపకారాగారానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ సబ్‌జైలు క్వార్టర్స్‌లో ఆదివారం ఫ్లోరింగ్ మరమ్మతుల పనులు చేయించారు. కొంతమంది పాత్రికేయులు ఈ విషయంపై జైలర్‌ను ప్రశ్నించగా ముద్దాయిలతో ప్రభుత్వ జైలు, క్వార్టర్స్‌లో పనులు చేయించుకునే ప్రొవిజన్ ఉందని తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ శ్రీనివాసబాబు మండల లీగల్ సెల్ సభ్యులతో కలిసి సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని మాధ్యమాల ద్వారా సబ్‌జైల్ ఖైదీలతో బయటపనులు చేయించుకుంటున్నారన్న ప్రచారం జరగడంతో తాను విచారణ చేపట్టానని తెలిపారు. జైల్‌లోని రికార్డులను పరిశీలించి ఖైదీలతో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.



హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా



పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐☐	5. Pay	వే ☐☐
2. Flute	వే ☐☐	6. God	వే ☐☐
3. Speed	వే ☐☐	7. Function	వే ☐☐
4. Heat	వే ☐☐	8. Dawn	వే ☐☐

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.





చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.



నవ్వుల జల్లులు!

టీచర్: రాముూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!



టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్




చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?


a


b


c

పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1. వేసవి 2. వేణువు 3. వేగము 4. వేడిమి 5. వేతనం 6. వేలుపు 7. వేడుక 8. వేకువ

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్సర్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్

01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్

01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్

03:30 హంగామా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 ఈ-జంక్షన్

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ డా.ఈటీవీ – (ఉ. 6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
★ ఆయుష్ (ఉ. 9:30)
★ లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ (ఉ. 10:00)
★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్. వి. ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఘీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ఛాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మాండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయె - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్. డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO: **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

'ఆ చట్టాన్ని రద్దు చేయండి'



మాట్లాడుతున్న సుబ్బారావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ), న్యూస్‌టుడే : ఏపీ సెల్ఫ్ ఇండిపెండెంట్ ఎడ్యుకేషనల్ యాక్టు-2017ను తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఉదయం హనుమాన్‌పేట సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యాసంస్థలకు ఊడిగం చేస్తోందని, కస్టరైజేషన్, రేషనలైజేషన్‌ల పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను మూసివేస్తోందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్‌గా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, అధ్యక్షులు పున్నం అనిల్, సహాయ కార్యదర్శి ఆవుల గోపినాధ్, గరికే అఖిల్, శ్రీను, ఉప్పులూరి అరుణ్, మల్లేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరే వేళలు

ప్రాంతం	సమయం	ఏ రోజుల్లో
హైదరాబాద్	9:35గం.	ప్రతి రోజు
హైదరాబాద్	13:20	బుధవారం మినహా
హైదరాబాద్	17:20	ప్రతి రోజు
హైదరాబాద్	17:35	ప్రతి రోజు
హైదరాబాద్	21:55	ప్రతి రోజు
విశాఖపట్నం	12:30	బుధవారం మినహా
విశాఖపట్నం	18:40	బుధవారం మాత్రమే
తిరుపతి	15:30	బుధవారం మినహా
చెన్నై	7:55	ప్రతిరోజు
చెన్నై	17:20	ప్రతి రోజు
బెంగళూరు	7:45	ప్రతి రోజు
బెంగళూరు	8:25	గురు, శుక్ర, శని, ఆది
బెంగళూరు	14:00	మంగళవారం మినహా
బెంగళూరు	20:00	ప్రతి రోజు
ఢిల్లీ	9:05	ప్రతి రోజు
ఢిల్లీ(హైదరాబాద్ మీదుగా)	17:20	ప్రతి రోజు
ఢిల్లీ	20:40	ప్రతి రోజు

- న్యూస్‌టుడే, విమానాశ్రయం (గన్నవరం)

దుర్గగుడి విశేషాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవ అనంతరం అమ్మవారికి వస్త్రాలంకృత సేవను రుత్వికులు నిర్వహిస్తారు. టిక్కెట్టు రుసుము రూ.25 వేలు చెల్లించిన ఆరుగురు భక్తులను మాత్రమే ఈ పూజకు అనుమతిస్తారు. వారికి అమ్మవారి తొలి దర్శనం, ఆశీర్వచనం ఉంటుంది.

✪ దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున 4 గంటల నుంచి 5 గంటల వరకు జగన్మాత దుర్గమ్మకు ఖడ్గమాల పూజ చేస్తారు. స్థలాభావం కారణంగా టిక్కెట్టు రుసుము రూ.5,116 చెల్లించిన 12 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు.

✪ మల్లికార్జున మహామండపం ఒకటో అంతస్తులో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు శాంతి కళ్యాణం నిర్వహిస్తారు. ఆరో అంతస్తులో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు లక్ష కుంకుమార్చన, అష్టోత్తరం, సహస్ర నామార్చన పూజలు చేస్తారు.

దసరా ఉత్సవాలకు ఆటంకం లేకుండా పైవంతెన పనులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ పైవంతెన పనులు దసరా ఉత్సవాలకు ఆటంకం లేకుండా నిర్ణీత లక్ష్యం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం సూచించారు. పైవంతెన పనుల పురోగతిని ఎన్‌హెచ్ ఎస్ఈ జాన్‌మోషేతో కలిసి కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ కుమ్మరిపాలెం సెంటరు నుంచి దుర్గగుడి టోల్‌గేటు వరకు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన కూలీలను పెంచాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పనులు మార్చి 2018 నాటికి పూర్తి చేయాలన్నారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఆధునిక యంత్రాలు, అవసరమైన కూలీలను నియమించాల్సిన బాధ్యత సోమా కంపెనీ ప్రతినిధులపై ఉందన్నారు. పనుల వేగం మందగించే కొద్ది ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దుర్గమ్మ భక్తులతోపాటు సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దారు శివరావు, సోమా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సోమా కంపెనీ ప్రతినిధులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

దేవరపల్లి ఇసుక మేటల తొలగింపు అనుమతుల రద్దు

విజయవాడ సబ్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తోట్లవల్లూరు మండలం దేవరపల్లి లోని సుమారు 3.50 ఎకరాల పట్టా భూమిలో ఇసుక మేటల తొలగింపునకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్టు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కలెక్టరు బి. లక్ష్మీకాంతం తెలిపారు. రెవెన్యూ, జలవనరులు, గనుల, వ్యవసాయ శాఖల అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, గనుల శాఖ ఏడీ దీనిపై విచారణ జరిపి సమగ్ర వివరాలను అందిచాలని సూచించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరాం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమాన్‌పేటలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో నిధులు కొరత కారణంగా పేద బ్రాహ్మణులకు సహాయం అందడం లేదన్నారు. పేదరికంలో ఉన్న బ్రాహ్మణుల పట్ల వివక్ష చూపకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణ సహాయం అందించాలని కోరారు. కార్పొరేషన్‌కు గతంలో కేటాయించిన రూ.500 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, సమాఖ్య సేవలను బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలని బలరాం కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను స్వతంత్రగానే నిర్వహించాలని, బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నారనే ప్రకటనపై బ్రాహ్మణులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం విలీన ప్రయత్నాలను విరమించుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే సమాఖ్య జిల్లా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు ఎం. శివరామకృష్ణప్రసాద్, కె. అజయ్‌కుమార్, జి. శ్రీనివాసరావు, జి. వాసుదేవరావు, శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

సీఎం దృష్టికి వెళ్లిన వాస్తుకు విరుద్ధ పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వాస్తుకు విరుద్ధంగా సాగుతున్న పనుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి దేవాదాయ శాఖ ఆస్థాన జ్యోతిష్యుడు తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈశాన్యంలో ప్రసాదాల పోటు నిర్మాణం ప్రతిపాదనపై పాలకమండలి తొలి సమావేశంలోనే పాలకమండలి సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన విషయం విదితమే. ప్రసాదాల పోటును ఆగ్నేయంలో శంకర మఠం తొలగించిన స్థలాన్ని పరిశీలించాలని ఈవోను పాలకమండలి సభ్యులు కోరారు. అనంతరం వాస్తు వ్యవహారంపై ఆస్థాన జ్యోతిష్యులు పూజ్యం విశ్వనాథ్‌ను కూడా కలిసి అభిప్రాయం తెలపాలని కోరారు. స్పందించిన ఆయన ఆలయంలో వాస్తుకు విరుద్ధంగా చేపడుతున్న పనుల వల్ల దేవస్థానం అధికారులకే కాకుండా రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధికి కూడా ఆటంకాలు కలిగే ప్రమాదం ఉందని ఆస్థాన జ్యోతిష్యులు లిఖితపూర్వకంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

నవ్యాంధ్రకు జల క్రీడాహారం

నాగాయలంక, న్యూస్‌టుడే

నాగాయలంక జలక్రీడల అకాడమీకి అంగీకరించిన అధికారులు..!


నాగాయలంకలో పడవల పోటీలు (దాచినచిత్రం)

రాష్ట్రాన్ని జలక్రీడాకారుల కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం జల క్రీడల కేంద్రాల ఏర్పాటుకు చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. కృష్ణా జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, నాగాయలంక ప్రాంతాల్లో జలక్రీడల శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కావాల్సిన భూమి సమస్య తొలగిపోవటంతో సోమవారం జలక్రీడా కేంద్రాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడనుంది. నాగాయలంకలో శ్రీరామ పాద క్షేత్రం ఘాట్ సమీపంలో 70 సెంట్ల ప్రభుత్వ భూమిని జలక్రీడల అకాడమీ కోసం రెవెన్యూ అధికారులు కేటాయించగా తాత్కాలిక వసతి ఏర్పాటు కోసం కె.పాలెం ప్రాథమిక పాఠశాలను ఎంపికచేశారు. రాజధాని సమీపంలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద మూడెకరాల భూమిని జలక్రీడల కేంద్రం కోసం సేకరించగా ఇక్కడ భవనాల నిర్మాణం పూర్తయిన అనంతరం కార్యకలాపాలు ప్రారంభించేందుకు జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

నేడు విజయవాడలో వెలువడనున్న ప్రకటన

జలక్రీడల శిక్షణ కేంద్రాల ఏర్పాటుపై సోమవారం విజయవాడలో అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేలా విజయవాడ పున్నమీ ఘాట్ వద్ద సోమ, మంగళవారాల్లో క్రీడా ప్రాధికారిత సంస్థ జలక్రీడల క్రీడాకారులతో ప్రత్యేకంగా ప్రదర్శనలు ఇస్తారు. ఆదివారం సాయంత్రం దీనికి సంబంధించి పలువురు క్రీడాకారులు ముందస్తుగా రిహార్సల్స్ చేసుకోగా సోమవారం సాయంత్రం మూడు గంటల నుంచి ఈ ప్రదర్శనలు ఉంటాయి.


కేరళలో బ్యాక్‌వాటర్‌లో కయాకింగ్ చేస్తున్న దృశ్యం

రాష్ట్రంలో నాలుగుచోట్ల జలక్రీడల కేంద్రాలు

జలక్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల నుంచి మెరికల్లాంటి క్రీడాకారులను తయారుచేసేందుకు రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో జలక్రీడల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కృష్ణా జిల్లా పరిధిలోని నాగాయలంక, ఇబ్రహీంపట్నం వద్ద, పశ్చిమ గోదావరి జిల్లా ఎర్రకాలువ వద్ద, విజయనగరం జిల్లా తాటిపూడి వద్ద జలక్రీడల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గత నాలుగురోజులుగా రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ, జలక్రీడల నిపుణులతో ఆయా కేంద్రాల్లో పరిశీలన చేపట్టి అక్కడి పరిస్థితులకనుగుణంగా డిజైన్‌లను రూపొందిస్తున్నారు. ఆదివారం రాష్ట్ర కయాకింగ్ అండ్ కనోయింగ్ సొసైటీ కార్యదర్శి సాంబశివారెడ్డి నాగాయలంక ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ జలక్రీడల అకాడమీ ఏర్పాటుకు ఎలాంటి వనరులు కల్పించాలనే విషయమై అధ్యయనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కయాకింగ్, కనోయింగ్ విభాగంలో 19 రకాల పోటీలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ఉన్నాయని, వాటిలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తామని సాంబశివారెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం కేటాయించిన భూములను, బ్యాక్‌వాటర్‌తో కూడిన నదీపాయను సద్వినియోగం చేసుకుంటామన్నారు.

త్వరలో అకాడమీ ఏర్పాటు


నాగాయలంకలో జలక్రీడల నిర్వాహకులకు అనువైన స్థలం నదిని ఆనుకొని లభించడంతోపాటు తాత్కాలికంగా శిక్షణ పొందేవారికి వసతి కల్పించేందుకు భవనాలు కూడా అందుబాటులో ఉండటంతో రాబోయే ఒకట్రెండు నెలల్లోనే నాగాయలంకలో జలక్రీడల శిక్షణ కేంద్రం ప్రారంభం కానుంది. దాదాపు 30కిపైగా వివిధ రకాల బోట్లతో 40 మంది విద్యార్థులకు కయాకింగ్, సెయిలింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. కేరళ రాష్ట్రంలో మాత్రమే బ్యాక్‌వాటర్ పాయల్లో నదీ ప్రవాహానికి ఎదురుగా శిక్షణ పొందే వీలు ఉండగా నాగాయలంకలోని బ్యాక్‌వాటర్ పాయలోనూ అలాంటి పరిస్థితులే ఉండటంతో కయాకింగ్‌లో శిక్షణ పొందే విద్యార్థులకు సామర్థ్యం అధికమయ్యే అవకాశం ఏర్పడుతుందని **శివారెడ్డి** తెలిపారు. ఇబ్రహీంపట్నంలో నది గ్రామానికి దూరంగా ఉండటంతో అక్కడ మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేయటం పూర్తయిన తరువాత జలక్రీడల కేంద్రాన్ని ప్రారంభించవచ్చని తెలుస్తోంది. నాగాయలంకలో రానున్న పదిపదిహేను రోజుల్లో జలక్రీడలపై ఈ ప్రాంతవాసులకు అవగాహన కల్పించేలా ఒక భారీ ప్రదర్శనను ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని.. ఇప్పటికే జలక్రీడల శిక్షణ పొందిన క్రీడాకారులతో కయాకింగ్, సెయిలింగ్ విన్యాసాలు చేయిస్తున్నామని శివారెడ్డి తెలిపారు. ఆదివారం నాగాయలంక ఘాట్‌ను, జలక్రీడల కోసం కేటాయించిన భూమిని తహశీల్దార్ ఎస్. నరసింహారావు, ఎంపీపీ సజ్జా గోపాలకృష్ణ, దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మండవ బాలవర్థిరావుతో కలిసి ఆయన పరిశీలించారు.



సంగమం వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ❖ ఆకట్టుకున్న గజల్ శ్రీనివాస్ గీతాలు


ఆసక్తిగా తిలకిస్తున్న మంత్రి దేవినేని ఉమా, జడ్పీఛైర్‌పర్సన్ అనూరాధ, దుర్గగుడి ఛైర్మన్ గౌరంగబాబు, నేతలు


గజల్ శ్రీనివాస్ గానం

గొల్లపూడి, న్యూస్‌టుడే: 'ఎంత పుణ్యమో గోవును పూజిస్తే...ఎంత భాగ్యమో కృష్ణమ్మను సేవిస్తే' అంటూ ప్రముఖ గజల్ గాయకుడు శ్రీనివాస్ పాటలు వీనుల విందుగా సాగాయి. దుర్గగుడి పాలకమండలి సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ ఆధ్వర్యంలో గొల్లపూడి స్నానఘాట్ ఒడ్డున సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, కృష్ణానదికి హారతులు ఇచ్చే కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణానది ఒడ్డున పవిత్ర సంగమం వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు వెల్లడించారు. మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరం వారికి తెలిసేలా కృష్ణా నదీ తీరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మనిషిని కట్టిపడేసే శక్తి గజల్స్‌కు మాత్రమే ఉందని, నదీ తీరాన శ్రీనివాస్ గజల్స్ ఆలపించడం సంతోషంగా ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన చెక్ డ్యాం, వైకుంఠపురం-దాములూరు మధ్య బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా వెల్లడించారు. గోదావరి-పెన్నా నదులను కలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలి, తల్లిదండ్రులను గౌరవించుకోవాలి... నదీతీర ప్రాంతాన్ని కళలకు పుట్టినిల్లుగా తీర్చిదిద్దాలని కోరారు. జడ్పీ ఛైర్మన్ గద్దె అనురాధ మాట్లాడుతూ నదులను గౌరవించుకోవడం భారతీయుల సంప్రదాయమని పేర్కొన్నారు. నిర్వాహకులు గూడపాటి పద్మశేఖర్ మాట్లాడుతూ ఏడాది క్రితం నది ఒడ్డున అమ్మవారి విగ్రహం తనకు లభించిందని, ఆ రోజునే దుర్గమ్మను పూజించుకోవాలని అనుకున్నానని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుర్గగుడి ఛైర్మన్ గౌరంగబాబు, ఎంపీపీ వడ్లమూడి జగన్మోహనరావు, దుర్గగుడి పాలకమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. గజల్‌శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంత్రి సన్మానించారు. మహిళల పెద్ద సంఖ్యలో లలితా సహస్ర నామ పారాయణం చేసి దీపాలను కృష్ణానదిలో వదిలారు.

ఈక్వెస్టరియన్ పోటీల్లో పోరంకి విద్యార్థి సత్తా


ద్వితీయ స్థానంలో నిలిచిన రామ్‌సుందర్

పెనమలూరు, న్యూస్‌టుడే: తెలంగాణ స్టేట్ ఈక్వెస్ట్రియన్ అసోసియేషన్, హైదారాబాద్ పోలో క్లబ్‌లు సంయుక్తంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈక్వెస్ట్రియన్ పోటీల్లో నగర ఎన్‌సీసీ విద్యార్థి తోటకూరరామ్‌సుందర్ ద్వితీయ స్థానం సాధించాడు. పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. హార్స్‌షో-షో జంపింగ్ (జూనియర్స్) విభాగంలో రామ్‌సుందర్ ఈ విజయాన్ని సాధించాడు. నిర్దేశించిన సమయంలో అతను తనకు గుర్రంతో 10 హార్డిల్స్ దాటడంతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. హైదారాబాద్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి ప్రథమ స్థానం దక్కించుకొన్నాడు. విజయవాడ-3(ఎ) ఆర్అండ్‌వీ రెజిమెంట్ ఎన్‌సీసీ విభాగానికి చెందిన రామ్‌సుందర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చెన్నై, విజయవాడ, హైదారాబాద్ లలో అతను శిక్షణ తీసుకొన్నాడు. రామ్‌సుందర్ స్వగ్రామం పోరంకి. ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి మృత్యుంజయ్ ఇతనికి మార్గదర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజేతతో పాటు తల్లి తండ్రులు తోటకూర సూర్యనారాయణ, గౌతమిలను నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఆదివారం అభినందించారు.

ఆ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

గుణదల(విజయవాడ ఈఎస్‌టీ),న్యూస్‌టుడే: లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సంబంధించి జీఓ 199లో పొందుపరిచిన అనుబంధం-3 విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ బి.శంకర్ పేర్కొన్నారు. ఆదివారం యంజీ రోడ్డులోని హోటల్‌లో జరిగిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ ఈ జీఓలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు 2 ఫ్లోర్లు, 300చ.గజాలు స్థల విస్తీర్ణ పరిధిలో మాత్రమే ప్లాన్ డ్రాఫ్ట్ చేసేలా నిబంధన విధించారని తెలిపారు. దీని వల్ల ఎన్నో సంవత్సరాలుగా ఈ వృత్తినే నమ్ముకున్న అనుభవజ్ఞులైన సర్వేయర్లు తమ జీవనోపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆన్‌లైన్ ప్లాన్లు అప్రూవల్ విధానంలో తలెత్తుతున్న లోపాల వల్ల సంబంధిత లైసెన్స్‌డ్ టెక్నికల్ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీఓ 199లో అనుబంధం-3 విధానాన్ని ఉపసంహరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు డి.నాగశ్రీనివాస్, మదనగోపాల్, లలితారాం, రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.